బుధవారం
07-06-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 345
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

ఉక్రెయిన్‌లో భారీ ఆనకట్ట ధ్వంసం

రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులు, బాంబులతో విరుచుకుపడుతోంది. తాజాగా దక్షిణ ఉక్రెయిన్‌లోని అనేక ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందించే నోవా కఖోవ్కా ఆనకట్ట ధ్వం సమైంది.

2లో

త్వరలో అసెంబ్లీ రద్దు?

- ముందస్తు ఎన్నికలకే అధికార పార్టీ మొగ్గు
- వారాహి, యువగళం యాత్రలను కట్టడి చేసే వ్యూహం
- ప్రతిపక్షాల పొత్తులు తేలేలోపే ప్రచారం ఉధృతం చేసే యోచన

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల నిర్వహణకే అధికార పార్టీ మొగ్గుచూపుతున్నట్లు కనపడుతోంది. ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలు కూడా ముందస్తును బలపరిచేలా ఉన్నాయి. పొరుగున ఉన్న తెలుగు రాష్ట్రం తెలంగాణలో ఈ ఏడాది డిసెంబరులో ఎన్నికలు జరుగనున్నాయి. ఏపీలో షెడ్యూలు ప్రకారం ఎన్నికల నిర్వహణకు ఏప్రిల్ వరకు అవకాశం ఉంది. అయితే తెలంగాణతో పాటు ఏపీలో కూడా ఎన్నికలు జరిగితే ప్రస్తుత పరిస్థితుల్లో వైసీపీకి లబ్ధి చేకూరుతుందని ఆపార్టీ అధిష్ఠానం భావిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికల నిర్వహణ వల్ల టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీకే పరిమితమవుతారని, తెలంగాణలో ప్రచారం చేయడానికి సమయం ఉండదని, అది తమకు ప్లస్ అవుతుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. అలాగే రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగిన వారు కూడా ఏపీకి పరిమితమయ్యే అవకాశం ఉన్నందున బీఆర్ఎస్‌కు లాభిస్తుందని అంచనా వేస్తున్నారు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి గెలుపుకు శతవిధాలా సహకారం అందించిన కేసీఆర్, ఈసారి కూడా అదే సహకారాన్ని కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వైసీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆ వ్యూహంలో భాగంగానే ముందస్తు ఎన్నికలకు సీఎం జగన్ సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర నిర్వహిస్తూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామగ్రామాన ఎండగడుతున్నారు. ఇప్పటివరకు రాయలసీమలో మూడు ఉమ్మడి జిల్లాల్లో మాత్రమే పాదయాత్ర పూర్తయింది. ఇంకా 10 పాత ఉమ్మడి జిల్లాలు తిరగాల్సి ఉంది. మరోవైపు ఈనెల 14వ తేదీ నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా ప్రభుత్వ విధానాలపై దండయాత్రకు 'వారాహి' వాహనంతో సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లడం వల్ల టీడీపీ, జనసేన యాత్రలను కట్టడి చేసే అవకాశం ఉంటుందని వైసీపీ అధిష్ఠానం భావిస్తోంది. అలాగే వైసీపీ ఇప్పటికే 2024 ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసుకుని ఉంది. తెలుగుదేశం ఏ పార్టీలతో పొత్తులు పెట్టుకుంటుందో, వారెన్ని సీట్లు డిమాండ్ చేస్తారో, టీడీపీ ఎవరికి ఎన్ని సీట్లు కేటాయిస్తుందో తేల్చుకునేలోపే వైసీపీ ప్రచారంలో ముందంజలో ఉండే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. షెడ్యూలు ప్రకారం ఎన్నికల నిర్వహణ వల్ల ఆర్థిక కష్టాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని, ప్రజా ఆందోళనలు కూడా తీవ్రమయ్యే పరిస్థితులున్నాయని వైసీపీ అధిష్ఠానం అంచనా వేసింది. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులు రోడ్డెక్కి 84 రోజులుగా ఆందోళన బాట పట్టారు. ఈ పరిస్థితులన్నింటినీ బేరీజు వేసుకుని ముందస్తు ఎన్నికలే సరైన నిర్ణయంగా వైసీపీ ఒక అంచనాకు వచ్చింది. ఆ మేరకు మంత్రులు, వైసీపీ ఎమ్మెల్యేల సూచనల మేరకు పెద్దసంఖ్యలో రాష్ట్రంలోని ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీల ప్రక్రియను కూడా పూర్తి చేసింది. గడప గడపకూ పేరుతో గత నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి చేసిన లబ్ధి గురించి వివరించే కార్యక్రమాన్ని కూడా పూర్తి చేశారు. అంతా సిద్ధం చేసుకున్న తర్వాతే ఇటీవల కేంద్ర ప్రభుత్వాన్ని ముందస్తు ఎన్నికలకు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరినట్లు తెల్సింది. అలాగే ఎన్నికల వరకు ఇబ్బంది లేకుండా నిధులు, అప్పులు విషయంలో ఉదారంగా ఆదుకోవాలని కేంద్రాన్ని అభ్యర్థించినట్లు సమాచారం. మొదటినుంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వైసీపీ పూర్తి అనుకూలంగా వ్యవహరిస్తుండడంతో కేంద్ర పెద్దలు కూడా సహజంగానే అభయమిచ్చినట్లు తెల్సింది. ఫలితంగానే తొమ్మిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనలను పట్టించుకోని కేంద్రపెద్దలు, అందర్నీ ఆశ్చర్యపరుస్తూ 2014-15 రెవిన్యూలోటు కింద ప్రత్యేక సాధారణ ఆర్థిక సాయంగా ఒకేసారి రూ.10,461 కోట్లు విడుదల చేశారు. తాజాగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం గతంలో ఎన్నడూలేని విధంగా రికార్డుస్థాయిలో ఒకేసారి రూ.12,911 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ రెండు పరిణామాలు రాజకీయవర్గాలను విస్మయానికి గురి చేశాయి. తొమ్మిదేళ్లుగా విభజన అంశాల్లో ఏ ఒక్కటీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయని కేంద్ర ప్రభుత్వం, వైసీపీ ప్రభుత్వ ఆర్థిక కష్టాలకు అండగా నిలబడటం ప్రజల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు అప్పులు కూడా ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి చేసుకోవడానికి కేంద్రం వీలు కల్పిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్ఆర్‌బీఎం కింద ఏపీకి 30 వేల 500 కోట్ల రూపాయలు మాత్రమే రుణ పరిమితి ఉంది. ఈ ఏడాది డిసెంబరు నెల వరకు మొత్తం 9 నెలల్లో చేయాల్సిన అప్పు రెండు నెలల్లోనే రూ.18,500 కోట్లకు చేరింది. ఇది కూడా ముందస్తు ఎన్నికల వ్యూహంలో భాగమేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలు, ఇలాగే పదవీ విరమణ ప్రయోజనాలు కూడా పెద్దమొత్తంలో పేరుకున్నాయి. ఇవన్నీ చెల్లించాలంటే పెద్దమొత్తంలోనే నిధులు అవసరం. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సహకారం

- మిగతా 2 లో

మళ్లీ మూడు వేల కోట్ల అప్పు

- రెండు నెలల్లోనే రూ.18,500 కోట్లకు చేరిన రుణం
- ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో ఇక మిగిలింది రూ.12 వేల కోట్లే
- రెవెన్యూలోటు నిధులు విడుదలైనా ఆగని రుణ సేకరణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ప్రతి మంగళవారాన్ని అప్పుల వారంగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ అప్పు తీసుకొచ్చింది. ఇటీవల కేంద్రం నుంచి రెవెన్యూలోటు భర్తీ కింద పెద్దమొత్తంలో నిధులొచ్చినా గత ఐదు వారాల నుంచి వరుసగా అప్పులు చేసే ప్రహసనం కొనసాగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పరిమితికి మించి వేలకోట్లు అప్పులు చేసిన ప్రభుత్వం తాజాగా సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా రిజర్వ్ బ్యాంకులో రూ.3వేల కోట్లు అప్పు తీసుకుంది. వీటిలో వెయ్యి కోట్లు 14 సంవత్సరాలకు 7.36 శాతం వడ్డీతో, మరో వెయ్యి కోట్లు 20 సంవత్సరాలకు 7.33 శాతం వడ్డీతో రుణం పొందింది. రూ. 500 కోట్లు 10 సంవత్సరాలకు 7.33 శాతం, మరో రూ. 500 కోట్లు 19 సంవత్సరాలకు 7.33 శాతం వడ్డీతో రుణం తీసుకుంది. ఈ మూడువేల కోట్లతో ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలోని అప్పులు 18 వేల

- మిగతా 2 లో

'పోలవరం' వేగవంతం

- నిర్వాసితులకు మెరుగైన పునరావాసం
- పర్యాటక కేంద్రంగా చేస్తాం
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

విశాలాంధ్ర బ్యూరో–ఏలూరు: పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పనులను డిసెంబరు నాటికి పూర్తి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆయన మంత్రులు, అధికారులతో కలిసి పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. సీఎం జగన్ తొలుత ఎగువ కాపర్ డ్యామ్‌ను పరిశీలించారు. ఆపై పనుల పురోగతిని ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా ముఖ్యమంత్రి కి అధికారులు వివరించారు. అనంతరం దిగువ కాపర్ డ్యాం వద్ద పనులను సీఎం జగన్ పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు వద్ద అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... గైడ్ వాల్ డిజైన్లు కేంద్ర జల సంఘం, సీడబ్ల్యూసీ ఖరారు చేసిందని, వారి ఆమోదంతోనే పనులు చేశామని, గైడ్‌వాల్ లో చిన్న సమస్యను విపత్తు మాదిరిగా చూడటం సరికాదన్నారు. సీడబ్ల్యూసీ పరిశీలన పూర్తి కాగానే తక్షణం మరమ్మతులు చేయడానికి అధికారులు ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణాలలో వచ్చే చిన్న చిన్న సమస్యలను గమనిస్తూ సమీక్షించుకొని ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎగువ కాపర్ డ్యామ్‌లో ఖాళీలను వదిలేసిన కారణంగా వరద నీరు అతి వేగంతో ప్రవహించడం వల్ల ప్రాజెక్టు నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈఎస్ఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి కీలకమైన డయాఫ్రమ్ వాల్ దారుణంగా దెబ్బతిందన్నారు. దీనివల్ల ప్రాజెక్టు ఆలస్యం అవడంతో పాటు రూ.2 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందన్నారు. కానీ పోలవరం ప్రాజెక్టులో చిన్న సమస్యను విపత్తుగా చూపించే దౌర్భాగ్యమైన మీడియా ఉండటం దురదృష్టకరం అన్నారు. రూ.2 వేల కోట్లు అదనంగా ఖర్చు చేసిన విషయం మాత్రం ఎల్లో మీడియాకు కనిపించడం లేదన్నారు. గత

- మిగతా 2 లో



చంద్రబాబు నివాసం జప్తుకు బ్రేక్

ఈ దశలో నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేసిన ఏసీబీ కోర్టు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నివాసముంటున్న లింగమనేని రమేశ్ ఇంటి జప్తుకు అనుమతి ఇవ్వాలన్న పిటిషన్‌పై ఈ దశలో నిర్ణయం తీసుకోలేమని ఏసీబీ కోర్టు స్పష్టం చేసింది. లింగమనేని రమేశ్ ఇంటిని జప్తు చేయాలని సీఐడీ దాఖలు చేసిన పిటీషన్‌పై ఏసీబీ కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. కోర్టు అటాచ్‌మెంట్‌కు అనుమతించాలంటే ప్రాథమిక ఆధారాల విషయాన్ని, అభ్యర్థించిన అధికారిని విచారించాల్సిన అవసరం ఉందని ఏసీబీ కోర్టు పేర్కొంది. మే 18న నోటీస్ ఆర్డర్ చేసినందున లింగమనేనికి దస్త్రాలు ఇవ్వాలని

- మిగతా 2 లో

పోలవరం ఎత్తు తగ్గింపు కుట్రే

- కేంద్ర వైఖరిపై సీఎం జగన్ స్పష్టతివ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : పోలవరం జాతీయ ప్రాజెక్టు ఎత్తు తగ్గించే కుట్రలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పోలవరంలో పర్యటించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దీనిపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రాజెక్టు లక్ష్యసాధనకు కేంద్ర ప్రభుత్వం మంగళం పాడుతున్నట్లు కనపడుతోందన్నారు.

ముఖ్యమంత్రి జగన్ తక్షణమే కేంద్రం చేస్తున్న ద్రోహంపై స్పందించాలని, అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆ ప్రకటన ఇలావుంది. ఏపీకి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పదేపదే ద్రోహం చేస్తూనే ఉంది. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కూడా అదే ధోరణి అవలంబిస్తోంది. ప్రాజెక్టు ఎత్తు తగ్గించే కుట్రలకు

- మిగతా 2 లో



ఇదీ లోకం!

వాటి రాక ఆలస్యమవుతుందని ఈయనే ఋతుపవనాలను వెతుక్కుంటూ వెళుతున్నాడు.

దాని గురించి మాట్లాడవద్దన్నారు

- అమిత్ షాతో భేటీపై రెజ్లర్ బజరంగ్ పునియా
- అది దేశానికి చీకటి రోజు.. మేం రోడ్లపై, నిందితుడు పార్లమెంటులో

న్యూఢిల్లీ : అమిత్ షాతో సమావేశం గురించి బయట ఎక్కడా మాట్లాడరాదని తమకు ప్రభుత్వం నుంచి సూచనలు వచ్చాయని ఒలింపియన్ రెజ్లర్ బజరంగ్ పునియా అన్నారు. లైంగిక వేధింపుల ఆరోపణలపై భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమానికి పునియా నాయకత్వం వహిస్తున్నారు. పునియా ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ హోం మంత్రి అమిత్ షాతో శనివారం అర్ధరాత్రి జరిగిన సమావేశం గురించి మాట్లాడవద్దని నిరసనకారులను ప్రభుత్వం కోరిందని తెలిపారు. అయితే ఆ విషయాలు మీడియాలో వచ్చాయని, తమను మాట్లాడరాదని చెప్పి... వారే మీడియాకు లీక్ ఇచ్చారని అన్నారు. అలాగే, అమిత్ షా, తమకు ఎలాంటి ఏకాభిప్రాయం కుదరలేదని, తమ డిమాండ్లను ఆయన అంగీకరించలేదని, ఆయన నుంచి తమకు కావాల్సిన సమాధానమూ రాలేదని తెలిపారు. 'నిరసన ఉద్యమం ఆగిపోలేదు, ఇది కొనసాగుతుంది. దానిని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై మేము వ్యూహరచన చేస్తున్నాము' అని చెప్పారు. రాత్రి 11 గంటలకు ప్రారంభమైన సమావేశం గంటకు పైగా సాగిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అమిత్ షాతో చర్చల్లో పునియాతో పాటు సాక్షి మాలిక్, సంగీతా ఫోగట్, సత్యవర్త్ కడియన్ ఉన్నారు, మైనర్‌తో సహా ఏడుగురు మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై నిష్పాక్షిక విచారణ జరిపి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు డిమాండ్ చేశారు. చట్టం అందరికీ ఒకేలా ఉంటుందని అమిత్ షా రెజ్లర్లకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదని, నిజానికి ఆయనను 'కవచంగా ఉంచుతున్నారా' అని హోం మంత్రిని తాము

- మిగతా 2 లో

ఉక్రెయిన్‌లో భారీ ఆనకట్ట ధ్వంసం

కీవ్: రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులు, బాంబులతో విరుచుకుపడుతోంది. తాజాగా దక్షిణ ఉక్రెయిన్‌లోని అనేక ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు అందించే నోవా కఖోవ్కా ఆనకట్ట ధ్వం సమైంది. నీపర్ నదిపై 1956లో ఈ ఆనకట్టను నిర్మించారు. కఖోవ్కా జలాశయం సహా జల విద్యుత్ కేంద్రాన్ని రష్యా ధ్వంసం చేసినట్లు ఉక్రెయిన్ ప్రభుత్వం ఆరోపించింది. ఆనకట్ట నుంచి భారీగా నీరు దిగువకు వస్తున్నందున పరిసర ప్రాంతాల ప్రజలు వెంటనే ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరింది.

18 మిలియన్ క్యూబిక్ మీటర్ల వరద జలాశయం నుంచి పోటెత్తుతోందని ప్రాథమికంగా అంచనా వేసింది. అమెరికాలోని ఉటాలో గల గ్రేట్ సాల్ట్ లేక్‌కు సమానమైన నీటి నిల్వ సామర్థ్యాన్ని ఇది కలిగి ఉంది. ఆనకట్ట కుడివైపున ఉన్న 10గ్రామాలు, ఖేర్సన్ నగరంలోని అనేక ప్రాంతాల ప్రజలు అవసరమైన పత్రాలు, పెంపుడు జంతువులు తీసుకుని ఇంట్లో ఉన్న విద్యుత్ ఉపకరణాలను ఆపివేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని ఉక్రెయిన్ కోరింది. ఖేర్సన్ ప్రాంత సైనిక పాలన యంత్రాంగం కఖోవ్కా ఆనకట్ట తెగిపోయిన ఒక వీడియోను టెలిగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 30మీటర్ల పొడవు, 3.2 కిలోమీటర్ల వెడల్పు ఉన్న జలాశయం నుంచి భారీగా నీరు పోతున్న దృశ్యాలు ఆ వీడియోలో

కనిపిస్తున్నాయి. అయితే తాజా ఘటన రష్యా పనే అని ఉక్రెయిన్ మిలటరీ కమాండ్ ఆరోపించగా, ఆక్రమిత ఉక్రెయిన్‌లోని రష్యా అధికారులు మాత్రం ఇది ఉగ్రదాడి అని చెబుతున్నారు. దక్షిణ ఉక్రెయిన్‌లోని ఖేర్సాన్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని ఈ ఆనకట్ట వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైంది. గత కొన్ని రోజులుగా ఆనకట్ట సమీపంలో భారీగా దాడులు జరుగుతున్నాయి.

విశాలాంధ్ర ప్రపంచం

కోర్టు బోనులో ప్రిన్స్ హ్యారీ

లండన్: 130 ఏళ్లలో తొలిసారి బ్రిటన్ రాజకుటుంబానికి చెందిన ఓ వ్యక్తి కోర్టుకు హాజరయ్యారు. ఫోన్ హ్యాకింగ్‌కు సంబంధించిన కేసులో ఓ వార్తా సంస్థకు వ్యతిరేకంగా కింగ్ ఛార్లెస్-3 రెండో కుమారుడు ప్రిన్స్ హ్యారీ కోర్టు బోనులో నిలబడి సాక్ష్యం చెప్పారు. బ్రిటన్‌కు చెందిన మిర్రర్ గ్రూప్... అనేక మంది ప్రముఖుల వ్యక్తిగత విషయాలను సేకరించేందుకు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ ఫోన్ హ్యాకింగ్ ఆరోపణలకు సంబంధించి ప్రిన్స్ హ్యారీతో పాటు వంద మందికిపైగా ప్రముఖులు కోర్టులో దావా వేశారు. దీనిపై లండన్ కోర్టులో విచారణ చేపట్టగా, ఈ కేసులో సాక్ష్యం చెప్పేందుకు హ్యారీ మంగళవారం కోర్టు ఎదుట హాజరయ్యారు. ప్రస్తుతం భార్యా, పిల్లలతో కలిసి అమెరికాలో ఉంటున్న హ్యారీ సోమవారం లండన్ చేరుకున్నారు. మంగళవారం ఉదయం హైకోర్టు ఎదుట హాజరయ్యారు. తన వ్యక్తిగత వివరాలను సేకరించేందుకు మిర్రర్ గ్రూప్ ఉపయోగించిన మోసపూరిత పద్ధతుల కారణంగా తన జీవితం ఎలా ప్రభావితమైందో హ్యారీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఫోన్ హ్యాకింగ్‌కు పాల్పడటంతో పాటు 1996 - 2010 మధ్య కాలంలో ప్రైవేటు డిటెక్టివ్‌ల ద్వారా తన వ్యక్తిగత సమాచారాన్ని సేకరించిందని తెలిపారు. ఇలా చట్టవ్యతిరేకంగా సేకరించిన వివరాలతో140 వ్యాసాలను ప్రచురించినట్లు హ్యారీ కోర్టుకు వివరించారు. వాస్తవానికి ఈ కేసులో ప్రిన్స్ హ్యారీ సోమవారం కోర్టుకు హాజరవ్వాల్సి ఉన్నప్పటికీ ఆయన రాలేదు. జూన్ 4న ఆయన కుమార్తె ప్రిన్సెస్ లిలిబెత్ పుట్టినరోజు కావడంతో లాస్‌ఏంజిల్స్ నుంచి ఆయన ఆలస్యంగా బయల్దేరారని హ్యారీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కాగా.. ఈ కేసులో మిర్రర్ గ్రూప్ తరపు న్యాయవాదులు హ్యారీని క్రాస్ ఎగ్జామిన్ చేయనున్నట్లు సమాచారం. ఈ వారంలోనే హ్యారీని కోర్టులో ప్రశ్నించే అవకాశం ఉంది. కాగా బ్రిటన్ రాజకుటుంబానికి చెందిన వ్యక్తులు కోర్టుకు హాజరవ్వడం 130 ఏళ్లలో ఇదే తొలిసారి. అంతకుముందు 1870లో ఓ విడాకుల కేసుకు సంబంధించి ఎడ్వర్డ్ -7 కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పారు. 1891లో ఓ గ్యాంబ్లింగ్ కేసులోనూ ఇంగ్లీష్ హైకోర్టుకు వెళ్లి సాక్ష్యమిచ్చారు. అయితే, ఈ రెండు కూడా ఆయన రాజు కాకముందే జరిగాయి.

భారత్‌లో రైలు ప్రమాద ఘటన కలచివేసింది: బ్రిటన్ రాజు

లండన్: భారత్‌లోని ఒడిశా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాద ఘటన తనను ఎంతగానో కలచివేసిందని బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్ -3 పేర్కొన్నారు. రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం ప్రకటించారు. ఘోర రైలు ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తూ... భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు ఓ సందేశాన్ని పంపినట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ ఓ ప్రకటనలో తెలిపింది. 'బాలాసోర్‌లో జరిగిన భయంకర రైలు ప్రమాద ఘటన వార్తతో నేను, నా భార్య చాలా దిగ్భ్రాంతి చెందాం. చాలా బాధపడ్డాం. ఇంతటి విషాదకర ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారందరి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మా హృదయాల్లో భారతదేశానికి, భారత ప్రజలకు ప్రత్యేక స్థానం ఉంది. 1980లో ఒడిశాను సందర్శించి అక్కడి ప్రజలను కలిశాను. ఆ మధురజ్ఞాపకాలు ఇప్పటికీ నాలో ఉన్నాయి' అంటూ బ్రిటన్ రాజు పేర్కొన్నారు.

'పోలవరం' వేగవంతం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వంలో రామోజీరావు బంధువులకు నామినేషన్ పద్ధతుల్లో పనులు అప్పగించారన్నారు. ప్రస్తుతం స్పిల్ వే కాంక్రీట్ పూర్తయిందని, 48 రేడియల్ గేట్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు సీఎం జగన్ తెలిపారు. ఎగువ, దిగువ కాపర్ డ్యామ్ పూర్తయిందని, గ్యాప్ బీ3 వద్ద కాంక్రీట్ డ్యామ్ పూర్తయిందన్నారు. ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్ బి2 ప్రాంతంలో నింపడానికి అవసరమైన 100 శాతం ఇసుక రవాణా పూర్తయిందన్నారు.

నిర్వాసితుల పునరావాసంపై సమీక్ష

పునరావాస కాలనీలలో అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. నిర్వాసితుల్లో 12658 కుటుంబాలను తరలించామని అధికారులు తెలపగా షెడ్యూల్ ప్రకారం నిర్వాసిత కుటుంబాలను తరలించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని అద్భుత పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని, పర్యాటకులు ఉండేందుకు సకల సదుపాయాలతో హోటళ్లు నిర్మించడానికి కూడా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ కోటగిరి శ్రీధర్, స్థానిక ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, చీఫ్ ఇంజనీర్ సీ నారాయణ రెడ్డి, బీ సుధాకర్ బాబు, మెగా సంస్థ ఎండీ పీవీ కృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారుల పాల్గొన్నారు.

పోలవరం ఎత్తు తగ్గింపు కుట్రే

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడుతోంది. పోలవరం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగితే రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలకు ఎంతో ప్రయోజనకరం. 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తున నిర్మించాల్సి ఉంది. ఒకపక్క 41.15 మీటర్ల స్థాయికి నీళ్లు నిలబెట్టేందుకు అవసరమయ్యే నిధులంటూ రూ.12,911.15 కోట్లకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది పోలవరం ఎత్తు తగ్గించేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలో భాగమే. మరోపక్క 45.72 మీటర్ల ఎత్తున ప్రాజెక్టు నిర్మించి, తొలిదశగా 41.15 మీటర్లకు నీళ్లు నిలబెడతామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్లు ఇది తొలి, మలి దశల గురించి కేంద్రం తన ఆదేశాల్లో ప్రస్తావించక పోవడం గమనార్హం. పోలవరం ఎత్తు తగ్గించే కేంద్ర ప్రభుత్వ కుట్రలను సీపీఐ ఖండిస్తున్నదని ఆ ప్రకటనలో రామకృష్ణ పేర్కొన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం పదేపదే పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా పేరుగాంచిన పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణాన్ని, నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీల విషయాలను మంటగలుపుతున్నది. కేంద్ర ప్రభుత్వ దుష్ట పన్నాగాలను తిప్పికొట్టడంలో వైసీపీ ప్రభుత్వం మెతక వైఖరి అవలంభిస్తోంది. కేంద్రం మెడలు వంచి రాష్ట్ర అభివృద్ధికి నిధులు సాధించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపేందుకు, విభజన చట్ట హామీల అమలుకోసం, రాష్ట్ర అభివృద్ధికి నిధులు రాబట్టేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచకుండా జగన్ సర్కార్ చోద్యం చూస్తోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అడుగడుగునా ఏపీకి ద్రోహం చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టడాన్ని రామకృష్ణ నిరసించారు. ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టు సందర్శించిన నేపథ్యంలో ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణంపై, నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై స్పష్టత నివ్వాలని, పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆ ప్రకటనలో రామకృష్ణ డిమాండ్ చేశారు.

మళ్లీ మూడు వేల కోట్ల అప్పు

(మొదటిపేజీ తరువాయి)

500 కోట్లకు చేరుకున్నాయి. ఈ సంవత్సరానికి సంబంధించి ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిలో ఇంకా కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే అప్పు చేయడానికి అవకాశం ఉంది. 2014-15 రెవెన్యూలోటు కింద ప్రత్యేక సాధారణ ఆర్థిక సాయంగా కేంద్రప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా అనూహ్యంగా ఒకేసారి కేంద్ర ప్రభుత్వం గత వారం రూ.10,461 కోట్లు విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. అయినప్పటికీ మంగళవారం అప్పు చేసే ప్రక్రియ మాత్రం ప్రభుత్వం కొనసాగిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌ఆర్‌బీఎం కింద ఏపీకి 30 వేల 500 కోట్ల రూపాయలు మాత్రమే రుణ పరిమితి ఉంది. ఈ ఏడాది డిసెంబరు నెల వరకు మొత్తం 9 నెలల్లో చేయాల్సిన అప్పు రెండు నెలల్లోనే రూ.18,500 కోట్లకు చేరింది.

చంద్రబాబు నివాసం జప్తుకు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

సీఐడీకి ఆదేశాలు జారీ చేసింది. చంద్రబాబు ఇల్లు అటాచ్ మెంట్ కోరిన అధికారిని విచారించే అధికారం కూడా తమకు ఉందని ఏసీబీ కోర్టు స్పష్టం చేసింది. మరోవైపు తన ఇంటిని అటాచ్ చేసేందుకు సీఐడీ చేస్తున్న ప్రయత్నాల్ని వ్యతిరేకిస్తూ లింగమనేని రమేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. దీనిపై స్పందించిన కోర్టు.. అటాచ్ మెంట్ నోటీసుల్ని మాత్రం ఆయనకు ఇమ్మని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది.

త్వరలో చైనాలో పర్యటిస్తా: జియోమారా

టెగూసిగాల్ప : హెూండూరాస్ దేశాధ్యక్షురాలు జియోమారా కాస్ట్రో జూన్ 9-14 వరకు చైనాలో పర్యటించనున్నారు. హోండూరాస్ రాజధాని టెగూసిగాల్పలో చైనా... రాయబార కార్యాలయాన్ని ప్రారంభించింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి దేశాధ్యక్షురాలు జియోమారా హాజరు కాలేదు. అయితే ఆమె తన ట్విట్టర్ ఖాతా ద్వారా చైనా పర్యటన గురించి ప్రకటించారు. 'చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు నేను జూన్ 9 నుండి 14 వరకు ఓ ప్రత్యేక మిషన్‌తో చైనాను సందర్శిస్తాను. హోండూరాస్ పునర్నిర్మాణానికి శాస్త్రీయ, సాంకేతిక, వాణిజ్య, సాంస్కృతికం వంటి రంగాల్లో చైనా సాయం కోరనున్నాం' అని పేర్కొన్నారు. జియోమారా పర్యటనపై హోండూరాస్ విదేశాంగమంత్రి ఎడ్వర్డో ఎన్రిక్ రీనా మాట్లాడుతూ... 'అధ్యక్షురాలు జియోమారా చైనా అధికారిక పర్యటన మాకెంతో శుభవార్త. ఈ పర్యటనలో రెండు దేశాలకు సంబంధించిన కొన్ని ఒప్పందాలపై ఆమె సంతకం చేయనున్నారు' అని అన్నారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతమవుతాయని చెప్పారు.

అక్రిడిటేషన్ల జారీలో తీవ్ర అన్యాయం

- సమాచార కమిషనర్‌కు సమస్యలు వివరించిన ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం
- సానుకూలంగా స్పందించిన కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ: జిల్లాల పరిధిలోని అక్రిడిటేషన్ల జారీ విషయంలో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని రాష్ట్ర సమాచార కమిషనర్ విజయకుమార్ రెడ్డికి ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి వర్గం తెలిపింది. ఈ మేరకు మంగళవారం సమాచార కమిషనర్‌ను ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం కలిసి సమస్యలను వివరించింది. జిల్లాల కలెక్టర్లు వాస్తవికతను గుర్తించకుండా జీవో పేరుతో ఎక్కువ మంది జర్నలిస్టుల దరఖాస్తులను తిరస్కరిస్తున్నారని పేర్కొంది. అనేక చోట్ల సమాచార శాఖ జిల్లా అధికారులు కలెక్టర్లను తప్పుదారి పట్టిస్తున్నారని కమిషనర్ కు తెలిపారు. జిల్లాల వారీ సమస్యలు వివరించిన అనంతరం సమస్యల పరిష్కారంపై సమాచార శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. చిన్న పత్రికలకు సంబంధించి ఐటీ రిటర్న్ నిబంధనలను సడలించాలని నాయకులు కమిషనర్‌కు తెలపగా... తమ పత్రిక ఆదాయపన్ను పరిధిలోకి రాదనే విషయాన్ని సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా తెలియజేస్తే సరిపోతుందని కమిషనర్ పేర్కొన్నారు. మండలాల్లో ఫ్రీలాన్స్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ మంజూరుకు పది సంవత్సరాల అనుభవం వుండాలన్న నిబంధన ప్రతిబంధకంగా మారిన విషయాన్ని నాయకులు వివరించారు. అయితే సదరు జర్నలిస్ట్ పది సంవత్సరాల అనుభవాన్ని వివరిస్తూ సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని కమిషనర్ తెలిపారు. ఆ మేరకు జిల్లాల్లోని సమాచార శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని జాయింట్ డైరెక్టర్ కస్తూరిని ఆదేశించారు. జిల్లాలలో డెస్క్‌లలో పనిచేస్తున్న సబ్ ఎడిటర్లకు పాత పద్ధతిలోనే అక్రిడేషన్ మంజూరు చేయాలని, అందుకోసం పత్రికల పేజీల నిబంధనలను సడలించాలని కమిషనర్‌ను నాయకులు కోరారు. ఈ విషయంపై సమీక్ష అనంతరం ఆయా పత్రికలు ఎన్ని పేజీలతో ప్రచురితమవుతున్నదీ మరోసారి చూసి అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రాలలో చిన్న పత్రికలకు వన్ ప్లస్ వన్ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు టూ ప్లస్ టు ఇవ్వాలని కోరారు ఈ విషయంపై మరోసారి పరిశీలిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. కమిషనర్ ను కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే జయరాజ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఏచూరి శివ, కృష్ణా అర్బన్ యూనిట్ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు, దాసరి నాగరాజు, సీహెచ్ రాంబాబు తదితరులు ఉన్నారు.

కాలుష్యం లేకుంటే సహకరిస్తాం... లేదంటే ఉద్యమిస్తాం

విశాలాంధ్రబ్యూరో-కాకినాడ: కాకినాడ సెజ్ లిమిటెడ్ ప్రతిపాదించిన బహుళ ఉత్పత్తుల పారిశ్రామిక పార్కు ఏర్పాటునకు పర్యావరణ ప్రభావ అంచనాలపై మంగళవారం తొండంగి మండలం ఏవీ నగరం గ్రామ పరిధిలో ఫౌండేషన్ భవనం వద్ద జిల్లా కలెక్టర్, పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి సంబంధిత శాఖల అధికారులు అభిప్రాయ సేకరణ నిర్వహించారు. నాలుగు రెవెన్యూ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. పరిశ్రమల కాలుష్యం వల్ల గ్రామాలు వదిలిపోవాల్సి వస్తోందని భయాందోళన వ్యక్తం చేశారు. వేలాది మత్స్యకార కుటుంబాలు మత్స్య సంపద పై ఆధారపడి జీవిస్తున్నాయని కాలుష్యం సముద్ర జలాల్లోకి వదిలితే మత్స్య సంపద నశించిపోయి తమ జీవనోపాధికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. తమ జీవనోపాధి దెబ్బతినకుండా పరిశ్రమలు ఏర్పాటుచేస్తే సహకరిస్తామని లేదంటే పరిశ్రమలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని మత్స్యకార నాయకుడు మడదా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అలాగే స్థానిక యువతకు 70 శాతం మందికి ఏర్పాటు చేయబోయే పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యు మురళీకృష్ణ మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసే పరిశ్రమల కోసం రైతులు భూములు ఇవ్వడం జరిగిందని, ఆయా కుటుంబాల వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలకు అవసరమైన టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.

ప్రతి దానికి మతం రంగు సరికాదు

- సీబీఐ మాజీ డైరెక్టర్ ప్రకటనపై కేంద్రం సమాధానం చెప్పాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : ఒడిశా రైలు ప్రమాద దుర్ఘటనకు సంబంధించి సీబీఐ పూర్వ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు చేసిన ప్రకటనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వైఫల్యం, అసమర్థతలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రం కుట్ర కోణాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. ప్రమాదానికి మైనారిటీలే కారణమంటూ వారిని లక్ష్యంగా చేసుకుని సంఘ్ పరివార్, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. దీనిని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రతి అంశానికి మతం రంగు పులమడం సమంజసం కాదన్నారు. సీబీఐ విచారణ పేరుతో సమస్యను పక్కదారిపట్టిస్తున్నారని విమర్శించారు. అసలు దోషులను తప్పించే పద్ధతులలో వ్యవహరిస్తున్నారని చెప్పారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు రైలు ప్రమాదంలో కుట్ర దాగుందని చెప్పడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. దర్యాప్తు నివేదిక బయటకు వచ్చేసరికి ప్రజలు దాన్ని మర్చిపోతారని, కుట్ర జరిగిందని చెప్పేస్తే ప్రజాగ్రహం నుంచి సులువుగా తప్పించుకోవచ్చని ఎత్తుగడలు వేస్తున్నారని విమర్శించారు. సీబీఐ పూర్వ డైరెక్టర్ ప్రకటనపై రైల్వే మంత్రి, హోంమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. పోలవరం పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పోలవరం ప్రాజెక్టుపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకాని కేంద్రంతో లాలూచీ పడి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టవద్దన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశవ్యాప్తంగా రైతుల నుంచి శ్రామికుడు వరకు ఆకలితో అలమటించే పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు కోట మాల్యాద్రి, చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

11న పైలట్ కొత్త పార్టీ?

- కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పి
- ఎన్నికలకు ముందు సచిన్ పైలట్ ఎత్తుగడ
- జోరందుకున్న ఊహాగానాలు

జైపూర్ : రాజస్థాన్ కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్ ఈనెల 11న కొత్త పార్టీ ప్రారంభిస్తారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. ఆయన ఇటీవలి వారాల్లో తన పార్టీని పదేపదే సవాలు చేస్తూ వచ్చారు. రాష్ట్రంలో ఐక్యతను ప్రదర్శించడానికి పోరాడుతున్న పార్టీ నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు రాజస్థాన్‌లో ఆయన తన సొంత పార్టీని ప్రారంభించడం ద్వారా త్వరలో కాంగ్రెస్‌కు గణనీయమైన దెబ్బ తగులుతుందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. తన తండ్రి రాజేశ్ పైలట్ వర్ధంతి సందర్భంగా జూన్ 11న ఈ మేరకు 45 ఏళ్ల సచిన్ పైలట్ ఒక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం ఆయన డిమాండ్లపై స్పందిస్తుందని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. జూన్ 11న భారీ ర్యాలీని నిర్వహిస్తారన్న వార్తలను ఆ వర్గాలు కొట్టిపారేశాయి. రాజేశ్ పైలట్ నియోజకవర్గం అయినందున ప్రతి సంవత్సరం మాదిరిగానే దౌసాలో వర్ధంతిని పురస్కరించుకుని కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు. బీజేపీకి చెందిన వసుంధర రాజేపై వచ్చిన అవినీతి ఆరోపణలపై చర్య తీసుకోవడానికి పైలట్ తన స్వంత ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్‌కు బీజేపీ నాయకుడితో కుదిరిన ఒప్పందం కారణంగా వసుంధర రాజేపై ఎటువంటి చర్య తీసుకోలేదని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. అయితే దీనిని బీజేపీ తీవ్రంగా ఖండించింది. పైలట్ పార్టీ నాయకత్వం నుంచి కచ్చితమైన స్పందన కోసం వేచి చూస్తున్నారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

అవినీతిని ఎదుర్కోవడం, పరీక్ష పేపర్ లీక్‌లతో సహా యువత ఆందోళనలను పరిష్కరించడం అతని ప్రధాన దృష్టి అని వారు నొక్కి చెప్పారు. 'ఆయన (పైలట్) పార్టీ నాయకత్వం నుంచి ప్రతిస్పందన కోసం ఎదురు చూస్తున్నాడు. బంతి వారి కోర్టులో ఉంది' అని ఆయనకు సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ పీటీఐ తెలిపింది. గత నెలలో కాంగ్రెస్ నాయకత్వం అశోక్ గహ్లోత్, సచిన్ పైలట్ మధ్య నాలుగు గంటలపాటు జరిగిన సమావేశం ఒక పరిష్కారాన్ని రూపొందించడంలో విఫలమైంది. రాజస్థాన్ ఎన్నికల్లో 'సమైక్య పోరు' అని నేతలు వాగ్దానం చేసినా, ఆ ద్వేషం మాత్రం అలాగే ఉందని స్పష్టమైంది. ఇద్దరి నేతల మధ్య విభేదాలు అధిగమించలేనివని, ఆ బంధం తిరుగులేని స్థితికి చేరుకుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలాఉండగా, పైలట్‌కు సన్నిహితుడైన రాష్ట్ర మంత్రి మురారీ లాల్ మీనా పార్టీ ప్రారంభానికి సంబంధించిన ఊహాగానాలను ఖండించారు. 'కొత్త పార్టీ ఊహాగానాలు ఎక్కడ ప్రారంభమయ్యాయో నాకు తెలియదు. అలాంటి ఊహాగానాలలో నాకు ఎలాంటి సారాంశం కనిపించడం లేదు. నేను పార్టీ సిద్ధాంతాలను అనుసరించి పని చేస్తున్నాను' అని మీనా అన్నారని పీటీఐ తెలిపింది.

త్వరలో అసెంబ్లీ రద్దు?

(మొదటిపేజీ తరువాయి)

కోరిన మీదటే ఊహించని విధంగా రెవిన్యూలోటు నిధులు పెద్దమొత్తంలో కేంద్రం విడుదల చేసినట్లు చెపుతున్నారు. ఉద్యోగులను ప్రసన్నం చేసుకునే ప్రక్రియలో భాగంగానే సోమవారం చర్చల్లో చాలా సమస్యలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఇక మిగిలిన సమస్యలపై కూడా బుధవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఉద్యోగులకు బకాయిలు చెల్లిస్తే ప్రస్తుతానికి ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందులు తొలగినట్లేనని భావిస్తున్నారు. అలాగే ఇటీవల టీడీపీ మహానాడులో విడుదల చేసిన మినీ మేనిఫెస్టో ప్రజలపై ప్రభావం చూపకుండా మరికొన్ని సంక్షేమ పథకాల అమలుపై రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అసెంబ్లీ రద్దు అంశం బుధవారం జరిగే కేబినెట్‌లో చర్చకొచ్చే అవకాశం ఉన్నా, లేకున్నా...కీలక సమస్యల పరిష్కారం తర్వాత త్వరలోనే అసెంబ్లీ రద్దు నిర్ణయం మాత్రం తప్పదని వారు స్పష్టం చేస్తున్నారు.

దాని గురించి మాట్లాడవద్దన్నారు

(మొదటిపేజీ తరువాయి)

అడిగామని బజరంగ్ పునియా చెప్పారు. 'వారు దానిపై చర్చిస్తున్నారని, కచ్చితంగా చర్య తీసుకుంటారని ఆయన (అమిత్ షా) మాకు హామీ ఇచ్చారు' అని చెప్పారు. 'మేము అన్నింటినీ పణంగా పెట్టాము. మా ఆందోళనకు అడ్డంకిగా మారితే మా ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నాము. ఇది పెద్ద విషయం కాదు' అని అన్నారు. నూతన పార్లమెంటు ప్రారంభోత్సవం రోజున మీరు నిరసనలు చేయడం.. అనుమతులు లేకుండా చట్టాన్ని ఉల్లంఘించారనే వాదనలు ఉన్నాయని ప్రస్తావించగా.. బజరంగ్ పునియా మాట్లాడుతూ జంతర్ మంతర్ వద్ద నిరసన చేయడానికి కూడా తమకు అనుమతి ఇవ్వలేదని, రోడ్లపై ప్రత్యేకంగా ఎలా అనుమతి ఉంటుందని అన్నారు. నూతన పార్లమెంటు ప్రారంభోత్సవం గురించే దేశవ్యాప్తంగా చర్చ ఉన్నది వాస్తవమేనని పేర్కొంటూ, జాతీయ జెండాను ప్రపంచ యవనికపై రెపరెపలాడించిన క్రీడాకారులు, ఆడపిల్లలు రోడ్లపై నిరసనలు చేస్తుంటే, పోలీసులు వారిని అడ్డుకున్నారని అన్నారు. వారితోపాటు జాతీయ జెండాను కూడా నేలపై వేసిన చిత్రాలు చూశామని వివరించారు. కానీ, ఆడ పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి మాత్రం నూతన పార్లమెంటు ప్రారంభోత్సవంలో ఉన్నారని తెలిపారు. తనకు తెలిసి అది దేశానికి చీకటి రోజు అని చెప్పారు. రెండు మూడు రోజుల్లో నిరసన కార్యచరణను వెల్లడిస్తామన్నారు. జంతర్ మంతర్ వద్ద నిరసనకు అనుమతుల కోసం తాము సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

సుజల స్రవంతితోనే ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి

ప్రాజెక్టు నిర్మాణంలో పాలకుల అలసత్వం: జేవీఎస్ఎన్, ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణమే శరణ్యమని వక్తలు ఉద్ఘాటించారు. సీపీఐ అనకాపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం అనకాపల్లి రోటరీ క్లబ్ హాల్‌లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు సాధనకు ఉత్తరాంధ్ర సదస్సు సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణంలో వైఫల్యం చెందిందని, జాతీయ స్థాయిలో గుర్తించిన ప్రాజక్టుల నిర్మాణంలో కూడా ఏపీ ప్రభుత్వం వెనకబడి ఉందని విమర్శించారు. వైసీపీ అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతున్నా నేటికీ ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తి కాలేదని అన్నారు. బహుళజాతి ప్రాజెక్టుల జాబితాలో మినీ రిజర్వాయలు నిర్మిస్తున్నారని అన్నారు. బహుముఖ ప్రయోజనాలను విస్మరించి కావాలనే ప్రాజెక్టుల నిర్మాణంలో తాత్సారం చేస్తోందని, ఫలితంగా ఉత్తరాంధ్ర నీర్లక్ష్యానికి గురైందని అన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు దొందూ దొందేనని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాందే ఉత్తరాంధ్ర అనుబంధ ప్రాజెక్టులు పూర్తి కావని చెప్పారు. ఉత్తరాంధ్ర జీవనాడి సుజల స్రవంతి ప్రాజెక్టు. రెండు సంవత్సరాలో పూర్తి చేస్తామన్న ప్రాజెక్టు ఏవి జరగలేదని, అందులో భాగంగానే పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో ప్రభుత్వం దోబూచులాట అడుతోందని అన్నారు. ప్రజలు అన్ని విషయాలను పరిశీలిస్తున్నారని, నిర్వాసితులకు నేటికి న్యాయం జరగలేదని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ డ్రామాలు మొదలు పెట్టిందని, డీపీఆర్‌కు అనుగుణంగా దక్కాల్సిన బడ్జెట్‌ను కేంద్రం నుంచి రాబట్టడంలో జగన్ వైఫల్యం చెందారన్నారు. ప్రజాపక్షంలో ఉన్న పార్టీలు జనాలను సమీకరించి ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె లోకనాథం, టీడీపీ నాయకులు బుద్ధ నాగజగదీశ్, సీపీఐ విజయనగరం, విశాఖ జిల్లా కార్యదర్శులు ఒమ్మి రమణ, ఎం పైడిరాజు మాట్లాడారు. ముందుగా సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మాకిరెడ్డి రాము నాయుడు,గురుబాబు, కె ఎస్ సన్యాసిరావు, అప్పలరాజు, వై ఎన్ భద్రం, మల్లమాధవరావు, నాగరాజు, వీయ్యాపు రాజు, ఫణీంద్ర, సత్తిబాబు తదితరాలు పాల్గొన్నారు.

సీఆర్ జీవితం నేటి తరానికి ఆదర్శం

హరినాథరెడ్డి

విశాలాంధ్ర- తిరుపతి: భూపోరాటయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి చంద్ర రాజేశ్వరరావు జీవితం స్ఫూర్తిగా తీసుకొని ప్రజా పోరాటాలు ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చంద్ర రాజేశ్వరరావు 109వ జయంతి సందర్భంగా తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో సీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు భూస్వామ్య కుటుంబంలో పుట్టినా కమ్యూనిస్టు భావజాలంతో సొంత భూమిని కూడా భూమిలేని వారికి పంచారన్నారు. చల్లపల్లి జమీందారులతో పోరాటం చేసి దున్నేవాడికే భూమి అనే నినాదంతో అనేక వేల ఎకరాలు పేద ప్రజలకు పంచారని చెప్పారు. దేశీయంగా, అంతర్జాతీయంగా కమ్యూనిస్టు ఉద్యమానికి అనేక సేవలు అందించి సుదీర్ఘ కాలం పాటు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేమయ్య యాదవ్ మాట్లాడుతూ దేశంలో మతోన్మాదుల నుంచి ప్రజలను కాపాడాలని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండడానికి యువ కమ్యూనిస్టులు అవసరమని చంద్ర రాజేశ్వరరావు జనసేవ దళ్ ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, బండి చలపతి, నగర కార్యవర్గ సభ్యులు, ఎన్ డి రవి, ఎన్ శివ, శ్రీరాములు, గోవిందస్వామి, రామకృష్ణ, సిహెచ్ శివ, రామచంద్రయ్య, పద్మ రెడ్డి, సాయి, ఏపీ బాల, అల్లా బక్షు, రాజేంద్ర, ప్రవీణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

20న 'చలో విజయవాడ' జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: భవన నిర్మాణరంగ కార్మికుల పెండింగ్ క్లెయిముల పరిష్కారం కోసం ఈనెల 20న నిర్వహించే 'చలో విజయవాడ' నిరసనను జయప్రదం చేయాలని ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం డీఎస్‌ఆర్ అమర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో 'చలో విజయవాడ' కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి తండ్రి పెట్టిన పథకానికి తూట్లు పొడిచి రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికుల కడుపులు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం-1996... ఆంధ్రరాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి అమలు కావడం లేదన్నారు. కార్మికుల నుంచి సంక్షేమబోర్డులో సభ్యత్వం పేరుతో, భవన నిర్మాణ యజమానులు దగ్గర నుండి సెస్ పేరుతో వసూలు చేస్తున్న వేల కోట్ల నిధులను జీఓ నంబర్ 17 ద్వారా ప్రభుత్వం సంక్షేమ పథకాలకు, ఇతర ప్రయోజనాలకు మళ్ళించుకోవడం దారుణమన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న సుమారు 45 వేల క్లెయిములకు నిధుల్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.గురువారెడ్డి, కార్యదర్శి ఆల్తి మారయ్య, సరగడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం

విశాలాంధ్ర-విజయవాడ: రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం చేకూర్చటమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గిట్టుబాటు ధర కంటే అధిక ఆదాయం పొందాలంటే సేంద్రియ వ్యవసాయ పంటల సాగు చేపట్టాలని, పురుగుమందుల అవశేషాలు లేని వ్యవసాయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్ లో మంచి గిరాకీ ఉందని ఆయన తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతులను పెంపొందించేందుకు రైతులు, ఎగుమతిదారులతో విజయవాడ లోని ఓ హోటల్‌లో మంగళవారం వర్క్ షాపు నిర్వహించారు. దీనిని ప్రారంభించిన మంత్రి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రం నుంచి అధిక స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులు జరుగుతున్నాయని, వీటిని మరింత పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కిడ్నీ బాధితులకు అండగా ఉంటాం

కేంద్ర ఆరోగ్య మంత్రి భారతి ప్రవీణ్ పవార్

విశాలాంధ్ర-ఎ కొండూరు: గత పదిహేనేళ్లుగా కిడ్నీ వ్యాధులకు గురై వందలాదిమంది గిరిజనులు మరణించడం బాధాకరమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి డా.భారతి ప్రవీణ్ పవార్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చైతన్యనగర్ తండాలో మంగళవారం ఆమె కిడ్నీ బాధితులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వారికి అందుతున్న వైద్య సహకారాన్ని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కిడ్నీ బాధితులకు అందుతున్న వైద్య సేవలు సరిగా లేవని కొంతమంది మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా... ఉచితంగా మందులను సరిగా ఎందుకు అందజేయడం లేదని జిల్లా వైద్యశాఖ అధికారులను ప్రశ్నించారు. అలాగే బాధితులకు కిడ్నీ సమస్యపై పూర్తి అవగాహన కల్పించి వారికి సరైన వైద్య సదుపాయం అందించాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో మంచినీటి సమస్యపై స్థానికులు ఆమెకు వివరించారు. కృష్ణాజలాలను తాగునీరుగా అందించేందుకు గ్రామంలో నిర్మించిన సింటెక్స్ ట్యాంకులను అపరిశుభ్రంగా ఉంచడమే కాకుండా రెండు రోజులకొకసారి మంచినీటిని అందులో పోస్తున్నారని ఆ నీటిని తాగలేకపోతున్నామని వివరించగా వెంటనే అక్కడున్న ఆర్‌డబ్ల్యూసి అధికారులను ఇదేమిటని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. మంచినీటిని సరిగానే పోస్తున్నామని అధికారులు సమాధానమివ్వగా మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఇక్కడున్న ప్రజలకు మీ మీద ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదని, కనీసం మానవతా దృక్పథంతో శుద్ధ కృష్ణా జలాలను అందించాలని లేని పక్షంలో అధికారులపై చర్యలు తప్పవని ఆమె ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను హెచ్చరించారు. అలానే ఎ కొండూరులో ఆయుష్ భవనంలో రూ.40 లక్షలతో నిర్మించిన డయాలసిస్ భవనాన్ని మంత్రి పరిశీలించారు. అక్కడ డయాలసిస్ జరుగుతున్న రోగులకు ఎటువంటి వైద్య సహాయం అందుతుందో నేరుగా రోగులనుండే తెలుసుకున్నారు. ఐరన్ ఇంజక్షన్ల కొరత ఉందని రోగులు చెప్పడంతో వెంటనే సంబంధిత అధికారులకు ఇంజక్షన్లు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె తెలిపారు. మండలంలో తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొబ్బూరి శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి గుత్త సుబ్రహ్మణ్యం, తిరువూరు నియోజకవర్గ కన్వీనర్ ధారా రామచంద్రరావు, గంపలగూడెం మండల అధ్యక్షులు మోహన్‌రావు, డీఎంహెచ్‌ఓ సుహాసిని, మండల తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఏవో టిప్పు సుల్తాన్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎం మూర్ఖత్వం, డబ్బుపిచ్చే పోలవరానికి శాపం

మాజీ మంత్రి దేవినేని ఉమ ఆరోపణ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో 48నెలల్లో ఒక్క ప్రాజెక్ట్ పూర్తిచేసి, ఒక్క ఎకరాకు నీళ్లివ్వని జగన్...తనకు మిగిలి ఉన్న 278రోజుల్లో పోలవరం పూర్తి చేస్తాడా? జగన్‌మోహన్‌రెడ్డి మూర్ఖత్వం, డబ్బు పిచ్చి పోలవరానికి శాపాలుగా మారాయని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోలేకనే ప్రాజెక్ట్ ఎత్తుని 150 మీటర్లనుంచి 135 మీటర్లకు పరిమితం చేశారన్నారు. చేతిలో 31 మందికి పైగా ఎంపీలను ఉంచుకొని ప్రాజెక్ట్‌ను పూర్తిచేయలేని అసమర్థ ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయినా, గైడ్ బండ్ కుంగినా తనకేమీ సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఎన్నికలు వస్తున్నాయని హడావుడిగా ఇసుకతో గుంతలు పూడ్చే కార్యక్రమానికి తెరలేపారని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాసితుల్ని గాలికొదిలేసి బ్యూటిఫి కేషన్ పేరుతో రూ.300కోట్లు తగలేసి విగ్రహాలు పెడుతోందని మండిపడ్డారు. పట్టిసీమ దండగన్న ప్రబుద్ధుడు... 4ఏళ్ల నుంచి ఆ మోటార్లు తుప్పుపట్టేలా చేసి, రూ.786కోట్లతో మరోఎత్తిపోతల పథకం కడతామని చెప్పటాన్ని ఉమ తప్పు బట్టారు. 'పోలవరం ప్రాజెక్ట్ సందర్శనకు కేవలం సాక్షి మీడియాకు, ఐఅండ్‌పీ.ఆర్ విభాగానికి మాత్రమే ఎందుకు అనుమతిస్తున్నారు? ఇతరమీడియా సంస్థలు, ప్రతినిధుల్ని ఎందుకు పోలీస్ వలయంలో ఉంచుతున్నారు?' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించినా, నీటినిల్వ సామర్థ్యం తగ్గించినా ఇంకా 20వేల నిర్వాసిత కుటుంబాలకు న్యాయం చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రభుత్వానికి ఇంకా 278 రోజుల సమయమే ఉందని, వరదలు వచ్చే నాటికి కేంద్రప్రభుత్వం నుంచి డీపీఆర్-2 అనుమతి పొందకుండా, కేంద్రం నిధులు ఇవ్వకుండా నిర్వాసితుల్ని ఎలా ఆదుకుంటారని ప్రశ్నించారు. పేద గిరిజన, గిరిజనేతర కుటుం బాలు త్యాగం చేయడంవల్లే టీడీపీ హయాంలో ప్రాజెక్ట్ నిర్మాణాన్ని 72శాతం పూర్తిచేయగలిగినట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిఉంటే 2020 జూన్ నాటికే పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యేదన్నారు. దేశవ్యాప్తంగా 16 జాతీయ ప్రాజెక్టులు ఉంటే, ఏప్రాజెక్ట్ లో జరగని విధంగా పోలవరం ప్రాజెక్ట్ పనులు టీడీపీ ప్రభుత్వంలో జరిగాయని రూ.14,418 కోట్లను కేంద్రం నుంచి టీడీపీ ప్రభుత్వం రాబట్టుకుం దని చెప్పారు. 4ఏళ్లలో ఇరిగేషన్ రంగానికి ఈ ప్రభుత్వం చేసిన ఖర్చెంత? ప్రాజెక్టుల్లో పూర్తిచేసిన పనులకు సంబంధించి పూర్తి వాస్తవాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదలచేయాలని దేవినేని ఉమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

11 నుంచి మున్సిపల్ యూనియన్ జాతీయ మహాసభలు

విశాలాంధ్ర-విజయవాడ: అఖిల భారత మున్సిపల్ వర్కర్స్ యూని యన్ మహాసభలు లక్నోలో జూన్ 11,12,13 తేదీల్లో జరగనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆసుల రంగనాయకులు, పోరుమామిళ్ల సుబ్బ రాయుడు తెలిపారు. ఈ మేరకు ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో మున్సిపల్ కార్మికుల స్థితి గతులపై, ప్రభుత్వాల తీరుపై మహా సభల్లో చర్చించి దేశవ్యాప్తంగా భవిష్యత్ పోరాటాలపై నిర్ణయం తీసుకుం టామని తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలు, రాజకీయ వేధింపుల నివారణ, ఒప్పంద మున్సిపల్ కార్మికుల క్రమబద్ధీకరణలో రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాలపై, ఒప్పంద పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, ఆఫీస్ సిబ్బంది సమస్యలపై దీర్ఘకాల పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాస్, ఉప ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు నీటిఖర్చును ప్రభుత్వమే భరించాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-పుల్లలచెరువు: ఉద్యానవన పంటలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం పుల్లలచెరువు మండలంలోని కుందంపల్లె గ్రామంలో రైతు సంఘం యర్రగొండపాలెం నియోజకవర్గ రెండవ మహాసభ జరిగింది. ముందుగా రైతు సంఘం జెండాను సంఘ నాయకులు మందగాని వీరయ్య, ఉన్నగిరి వెంకట సుబ్బయ్య ఆవిష్కరించారు. ఈ సభకు రైతు సంఘం నాయకులు పారా వెంకట నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2500 కోట్లు నిధులు కేటాయించి, వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను వెంటనే అమలు చేయాలన్నారు. ఇటీవల అకాల వర్షాలకు నష్టపోయిన బత్తాయి, బొప్పాయి, మామిడి తదితర ఉద్యాన పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి రైతుకు నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను పూర్తి సబ్సిడీపై అందించాలన్నారు. దేశంలో 50 నిమిషాలకు ఒక రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడని, ఎన్నికలకు ముందు రైతు ఆత్మహత్యలు జరగకుండా చూస్తానని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ మాటలు ఈరోజు ఏమయ్యానని ఆయన ప్రశ్నించారు. తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో లక్ష మంది రైతులు ఆత్మహత్యకు గురయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు బిగించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ప్రసాద్ విమర్శించారు. ఈ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే పశ్చిమ ప్రాంతంలో సుమారు నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, 20 లక్షల మంది ప్రజానీకానికి తాగునీరు అందుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రాజెక్టు కోసం పోరాడాలని, ఈ ప్రాంతంలో సాగునీరు లేక చాలా ఇబ్బంది పడుతున్న గ్రామాల్లో వెంటనే ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ... పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు అవసరమైన కార్యక్రమాలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవుండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పుల్లలచెరువు మండలంలోని సమ్మర్ స్టోరేజి ద్వారా 44 గ్రామాలకు నీళ్లు అందించాల్సిన పథకం... అధికారులకు, ప్రజాప్రతినిధులకు వరంగా మారింది తప్ప ఒక గ్రామం కూడా మంచినీళ్లకు నోచుకోలేదన్నారు. పుల్లలచెరువు మండలంలో చిన్న కందలేరుచెరువుకు పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ టీ5 కాలువ పనులు చేపట్టాలని, త్రిపురాంతకం మండలంలో చివర భూములకు సాగర్ జలాలు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీరారెడ్డి మాట్లాడుతూ... రైతుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పేది ఒకటి చేసేది మరొకటిగా ఉంటోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ కృష్ణగౌడ్, పుల్లలచెరువు మండల కార్యదర్శి జీవీ గురునాథం, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, రైతు నాయకులు నక్కా తిరుపతయ్య, మండల నాయకులు గుంటూరు శ్రీనివాసరావు, కొమరోలు సర్పంచి శ్రీనివాసులు, మందగాని నారాయణ, పారా వెంకటనారాయణ, కోట్ల శీను, మేడికొండ వెంకటేశ్వర్లు, పిడికిటి శేషయ్య, నియోజకవర్గంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇది ఉద్యోగుల ఉద్యమ విజయం

ఏపీ జేఏసీ అమరావతి

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీ జేఏసీ అమరావతి పోరాట ఫలితంగానే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యలకు పరిష్కారం లభించిందని, ఇది ముమ్మాటికీ ఉద్యోగుల విజయం అని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఫణిపేర్రాజు తెలిపారు. మంగళవారం విజయవాడలోని జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బొప్పరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగుల సంపూర్ణ సహకారంతో ఈ ఏడాది మార్చి 9 నుంచి మూడు దశలుగా ఉద్యమం చేస్తున్నామని తెలిపారు. ఉద్యమ ఫలితంగా ప్రభుత్వం ప్రతిదశలో స్పందిస్తూ వివిధ విభాగాల్లోని అనేక సమస్యలతో పాటు ప్రభుత్వం వాడుకున్న వేల కోట్ల బకాయిలను చెల్లించడం, వేల సంఖ్యలో కారుణ్య నియామకాలు, కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లో 16 శాతం హెచ్‌ఆర్‌ఏ, పోలీసులకు టీఏలు, సరెండర్ లీవులతో పాటు ఈ నెల జూన్ 1న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్వర్యంలో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకులతో జరిగిన చర్చల్లో ఆర్టీసీ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు, మునిసిపల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించి సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు సైతం సీఎస్ చొరవతో కొన్ని అక్కడికక్కడే పరిష్కారమయ్యాయని తెలిపారు. మరికొన్ని అంశాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఆయన వివరించారు. సోమవారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాలతో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం భేటీలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత ఆర్థిక అంశాలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలపై సానుకూల నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. అందులో ప్రధానంగా 1.7.2018, అలాగే 1.1.2019 రెండు డీఏ బకాయి మొత్తాలు, సరెండర్ లీవుల డబ్బులతో కలిపి ఈ ఏడాది సెప్టెంబరు లోపు చెల్లిస్తామని తెలిపారన్నారు. ఫణి పేర్రాజు మాట్లాడుతూ సీపీఎస్‌పై అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా స్పష్టత ఇస్తూ ఈనెల 7న జరిగే క్యాబినెట్‌లో చర్చించి మెరుగైన పింఛను విధానం ప్రకటిస్తామన్నారని తెలిపారు. వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల జీతాలు 010 పద్దు కింద జీతాలు చెల్లించేందుకు అంగీకరించారని, గత నాలుగు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న వీఆర్ఏలకు చెల్లించాల్సిన డీఏను కూడా ఇచ్చేందుకు మంత్రి వర్గ ఉపసంఘం సానుకూల నిర్ణయం చేసిందని అన్నారు. మహిళా ఉద్యోగులకు ఇస్తున్న 180 రోజుల మెటర్నిటీ లీవ్‌లను ఆన్ డ్యూటీగా పరిగణించేందుకు, సీపీఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించారని ఆయన చెప్పారు. పైన ఒప్పందం కుదిరిన ప్రధాన అంశాలపై బుధవారం నాటి కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కాగా, ముందుగా నిర్ణయించిన మేరకు ఈ నెల 8న గుంటూరులో నాలుగవ ప్రాంతీయ సదస్సు ఏర్పాటు రోజున అన్ని జిల్లాల చైర్మన్‌లు, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ఉద్యమంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సదస్సుకు గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అందరూ వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కనపర్తి సంగీతరావు, కిరణ్ కుమార్, మల్లేశ్వరరావు, సాంబశివరావు, శ్రీనివాస్ జ్యోతి, అనుపమ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో కాంట్రాక్టర్ల ఆత్మహత్యలు

- కడపలో టీడీపీ నేత నారా లోకేశ్
- రాయలసీమను హార్టీ కల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

విశాలాంధ్ర బ్యూరో-కడప: జగన్ పాలనలో కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు రాక వారు ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి కల్పించారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర 118వ రోజు మంగళవారం కడప నగరంలోని బిల్టప్ విడిది గృహం నుంచి ప్రారంభమైంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నగరమంతా పసుపు మయమైంది. విడిది కేంద్రంలో రెడ్డి సామాజిక వర్గీయులను కలిశారు. అలాగే దారి పొడవునా బ్రాహ్మణ సంఘం, మీసేవా నిర్వాహకులు, ముస్లిం సామాజిక నాయకులు లోకేశ్‌ను కలసి వైసీపీ ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ తాను పాదయాత్ర మొదలు పెట్టిన తరువాత జగన్ పాలనలో ఎక్కువ నష్టపోయింది రెడ్డి సోదరులేనని తెలిసిందన్నారు. వారు జగన్ చేతిలో బాధితులుగా మారారన్నారు. కేవలం నలుగురు రెడ్లు మాత్రమే బాగుపడ్డారని, సజ్జల, సాయిరెడ్డి, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డికి తప్ప ఏ ఇతర కుటుంబానికి న్యాయం జరగలేదన్నారు. రెడ్డి సోదరులు మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచారన్నారు. జగన్ పాలనలో రెడ్లకు కనీస గౌరవం దక్కడం లేదన్నారు. తెలుగుదేశం పార్టీ మాత్రమే రెడ్డి సామాజిక వర్గానికి గౌరవం ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. 2014 నుంచి 19 వరకూ రెడ్లకు అనేక ముఖ్య పదవులు ఇచ్చామన్నారు. జగన్ పాలనలో రెడ్డి కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. నిన్నే టీడీపీ నాయకుడు జయరాం రెడ్డిపై వైసీపీ నాయకులు దాడి చేశారని అన్నారు. రెడ్డి కార్పొరేషన్ పెట్టడమే తప్ప జగన్ ఒక్క రూపాయి కేటాయించలేదని, పేదరికానికి కులం, మతం, ప్రాంతం ఉండదని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెడ్డి సామాజిక వర్గంలో ఉన్న పేదలను ఆదుకుంటామని చెప్పారు. రెడ్డి భవనం ఏర్పాటుకు సహకరిస్తామన్నారు. పెండింగ్ బిల్లులన్నీ టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. రాంగోపాల్ రెడ్డికి ఎమ్మెల్సీ సీటు ఇచ్చి గెలిపించుకున్నామన్నారు. జగన్‌లా దొంగ హామీలు ఇచ్చి మోసం చెయ్యనని, ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటామని తెలిపారు. పాదయాత్రలో రాయలసీమ రైతుల కష్టాలు చూశానని, రాయలసీమను హార్టీ కల్చర్ హబ్‌గా తయారు చేస్తామన్నారు. దానిమ్మ, అరటి, బొప్పాయి, మామిడి, కర్జూరం తదితర పంటలు వేసేలా అధిక ప్రోత్సాహం ఇస్తామన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎటువంటి పంటలు వెయ్యాలి, అందులో కొత్త రకాలు తీసుకొచ్చేందుకు పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో లాగానే 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ అందిస్తామని, పెట్టుబడి తగ్గించి, గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి పాత బీమా పథకాన్ని అమలు చేస్తామని లోకేశ్ తెలిపారు.

ANDHRA PRADESH STATE BEVERAGES CORPORATION LIMITED
(An undertaking of Government of Andhra Pradesh)
4th floor, Prohibition & Excise Complex, Prasadampadu, Vijayawada.

RFPNo.:APSBCL/31/Security/Depots/2023 Date: 05.6.2023

E-Procurement Tender Notice

e-Tenders are hereby invited from reputed and experienced agencies to provide the security services round the clock at 29 IMFL whole sale depots of Andhra Pradesh State Beverages Corporation Limited Vijayawada located in the state of Andhra Pradesh for a period of one year from the dates mentioned in the agreements.

Interested bidders can download and submit the bids online from https://tender.apeprocurement.gov.in (apeprocurementportal). For further details please visit our website:www.apsbcl.gov.in or https://tender.apeprocurement.gov.in (apeprocurementportal)

Managing Director
Andhra Pradesh State Beverages Corporation Limited

GOVERNMENT OF ANDHRA PRADESH
Office of the Commissioner of Distilleries and Breweries Prohibition and Excise Department - VIJAYAWADA

RFPNo.: CDB/3/VTS/2023-24 Date: 05.6.2023

E-Procurement Tender Notice

e-Tenders/ Request for proposal (RFP) for selection of an agency for the scope of work of providing services vehicle tracking system (VTS) services of owned/hired/rented vehicles being used by the distilleries and Breweries during the transportation of liquor/beer/Ethanol (Rectified spirit, Denatured Spirit & Extra Neutral Alcohol) for a period of three years from the states mentioned in the agreements.

Interested bidders can download and submit the bids online from https://tender.apeprocurement.gov.in (apeprocurementportal). For further details please visit our website:www.apsbcl.gov.in or https://tender.apeprocurement.gov.in (apeprocurementportal)

Commissioner of Distilleries and Breweries
Vijayawada

ANDHRA PRADESH STATE BEVERAGES CORPORATION LIMITED
(An undertaking of Government of Andhra Pradesh)
4th floor, Prohibition & Excise Complex, Prasadampadu, Vijayawada.

RFPNo:APSBCL/32/Internet Leased lines/2023 Date: 05.6.2023

E-Procurement Tender Notice

Sealed Bids under two packet tender system (reverse bidding) are invited by the Managing Director/Andhra Pradesh State Beverages Corporation Limited (APSBCL) Vijayawada.

AP through online (eprocurement portal) from the registered/licensed reputed and experienced Internet service providers to provide internet leased lines Brand width services to the Andhra Pradesh State Beverages Corporation Limited initially for a period of 3 years from the date of an agreement and extendable on satisfactory performance and on mutual consent on the same terms and conditions on half year/yearly basis for another one year.

Interested bidders can download and submit the bids online from https://tender.apeprocurement.gov.in (apeprocurementportal).

For further details please visit our website:www.apsbcl.gov.in or https://tender.apeprocurement.gov.in (apeprocurementportal)

Managing Director
Andhra Pradesh State Beverages Corporation Limited

సంపాదకీయం

దేశద్రోహ చట్టానికి మోదీ “రక్ష”

మోదీ హయాంలో సకల ప్రజాస్వామ్య వ్యవస్థలను అయితే విరూపం చేస్తున్నారు. లేదా ధ్వంసం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని విమర్శించడమో, లేదా మోదీ ప్రభుత్వ అకృత్యాలను ఎండగట్టడమో కూడా దేశద్రోహం అయిపోయింది. 1870లో బ్రిటిష్ వలస పాలకుల పాలన కొనసాగుతున్న దశలో దేశద్రోహ చట్టం అమలులోకి వచ్చింది. అది పరాయి పాలన కనక ఆ పాలనను విమర్శించే వారిని దేశద్రోహులుగా పరిగణించడంలో విచిత్రం లేకపోవచ్చు. లోకమాన్య బాల గంగాధర తిలక్, మహాత్మా గాంధీపై కూడా దేశ ద్రోహ కేసులు మోపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత నిజానికి ఇలాంటి కర్కశ చట్టాల అవసరమే లేదు. కానీ గత 75 ఏళ్ల కాలంలోనూ దేశద్రోహ చట్టాన్ని మన శాసనాల నుంచి తొలగించే ప్రయత్నమే జరగలేదు. ఈ నల్ల చట్టాన్ని తీసుకొచ్చిన బ్రిటన్ కూడా తమ చట్టాలనుంచి ఈ అంశాన్ని తొలగించింది. ఇంకా అనేక ప్రజాస్వామ్య దేశాలూ అదే పని చేశాయి. అంతెందుకు ఇటీవల పాకిస్తాన్ లోకూడా ఈ చట్టం చెల్లకుండా పోయింది. ప్రభుత్వానికి గిట్టని రచయితలు, సామాజిక కార్యకర్తలు, పౌరహక్కుల కోసం పోరాడే వారు, పత్రికా రచయితల మీద కూడా ఈ చట్టాన్ని ఎడా పెడా ప్రయోగిస్తూనే ఉన్నారు. ఈ చట్టంపై తీవ్ర విమర్శలు ఎదురైన నేపథ్యంలో ఒక దశలో లా కమిషన్ కూడా ప్రజాస్వామ్య దేశంలో దేశ ద్రోహ చట్టం లాంటి వాటికి స్థానం లేదని చెప్పింది. కానీ తాజాగా కర్నాటక మాజీ ప్రధాన న్యాయమూర్తి రితురాజ్ అవస్థి నేతృత్వంలోని లా కమిషన్ ఏలిన వారి మనసెరిగి దేశద్రోహ చట్టం కొనసాగవలసిందేనని సిఫార్సు చేసింది. ఇది నిరంకుశత్వానికి ప్రతీకగా తయారైన మోదీ ప్రభుత్వానికి బాగా నచ్చింది. లా కమిషన్ సిఫార్సు చేసినట్టు ఈ చట్టం కింద శిక్ష మరింత పెంచి ఈ కిరాతక చట్టాన్ని కొనసాగిస్తారట. నిరసనను, అసమ్మతిని, విమర్శను తట్టుకునే స్వభావం లేని మోదీ సర్కారు దేశ ద్రోహ చట్టానికి మరిన్ని కోరలు సమకూరుస్తుందనడంలో సందేహం లేదు. ఈ శాసనం ఉంది కనక న్యాయస్థానాలు సైతం దీన్ని తొలగించాలని సిఫార్సు చేయడానికి సాహసించడం లేదు. కేదార్ నాథ్ సింగ్ కేసులో అప్పుడు సుప్రీంకోర్టు ఈ చట్టం రాజ్యాంగ బద్ధతను అంగీకరించింది కానీ కేదార్ నాథ్ సింగ్ ను నిర్దోషిగా వదిలేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛకు ఈ చట్టం తీవ్ర విఘాతం కలిగిస్తుందన్న కనీస ప్రజాస్వామ్య దృక్పథం ఏ ప్రభుత్వంలోనూ కనిపించడం లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ చట్టాన్ని దుయ్యబట్టిన పార్టీలే తామే అధికారంలోకి వచ్చిన తరవాత దీన్ని యధేచ్ఛగా వినియోగిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాలు పెడదారి పడ్తున్నాయనో, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నాయనో భావించినప్పుడు విమర్శించడం ఏ ప్రజాస్వామ్యంలోనైనా ఉండవలసిన హక్కే. కానీ మన దేశంలో పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. ఈ చట్టాన్ని కొనసాగించడమే కాక మరింత కర్కశంగా తయారు చేయాలని లా కమిషన్ సిఫార్సు చేయడం రాజును మించిన రాజభక్తి కిందే లెక్క. ఆ సిఫార్సును మోదీ ప్రభుత్వం అమలు చేయాలనుకోవడం నిరంకుశత్వానికి ఆవలి గట్టు. కాంగ్రెస్ హయాంలోనూ, ఆ తరవాత కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ. ప్రభుత్వ హయాంలోనూ ఈ చట్టాన్ని వినియోగించిన సందర్భాలు చాలానే ఉన్నాయి. మోదీ హయాంలో ఈ కేసులు మోపడం మితి మీరింది. 2019, 2020లో రికార్డు స్థాయిలో దేశద్రోహ కేసులు మోపారు.

విచిత్రం ఏమిటంటే నిరసన ప్రదర్శనలు చేసిన వారి మీద, సామాజిక మాధ్యమాలలో సందేశాలు పంపిన వారి మీద, ప్రభుత్వానికో, నిర్దిష్ట చట్టాలకో వ్యతిరేకంగా నినాదాలు చేసినవారి మీద, కడకు వ్యక్తిగతంగా పంపుకున్న సందేశాల మీద కూడా దేశ ద్రోహ చట్టాన్ని ప్రయోగించారు. ఉదాహరణకు ఓ క్రికెట్ మ్యాచ్ లో పాకిస్తాన్ గెలిచినందుకు ముగ్గురు కశ్మీరీ యువకులు గత ఏడాది అక్టోబర్ లో అభినందన సందేశాలు పంపితే కూడా ఆగ్రాలో దేశ ద్రోహ చట్టం కింద కేసులు నమోదు చేశారు. విజయం సాధించింది మనకు కిట్టని దేశమే కావచ్చు. కానీ విజయం సాధించినందుకు సంబరపడడం ఏ రకంగా దేశద్రోహం కిందకు వస్తుందో తెలియదు. ఈ చట్టం వ్యవహారం అనేక సందర్భాలలో సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. 2021 జులైలో ఎన్.వి.రమణ ప్రధాన న్యాయ మూర్తిగా ఉన్నప్పుడు ఎడిటర్స్ గిల్డ్ కేసు దాఖలు చేస్తే సుప్రీంకోర్టు ఈ చట్టం మీద విమర్శలు చేసింది. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత ఈ చట్టం అవసరమా అని ప్రభుత్వాన్ని నిలదీసింది. అయితే చట్టంచెల్లదని చెప్పలేదు. దీన్ని పునస్సమీక్షించాలని కోరింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని మోదీ ప్రభుత్వం మరో సారి ఈ అంశాన్ని లా కమిషన్ కు నివేదించింది. ఆ కమిషనేమో సవరించాలని సూచించడంతో పాటు శిక్ష మరింత పెంచాలని సిఫార్సు చేయడం దారుణం. వెరసి లా కమిషన్ ప్రజాస్వామ్య హననానికి మోదీకి మరో ఆయుధం అందించింది. భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 124 ఎ ను దేశద్రోహ చట్టం అంటారు. దీనికి ఇచ్చిన నిర్వచనమూ స్పష్టంగానే ఉంది. ప్రభుత్వం మీద ద్వేషం పెంచడం, జనాన్ని హింసకు పాల్పడాలని రెచ్చగొట్టడం దేశద్రోహం కింద లెక్క. ఈ పని మాటల్లో కానీ, రాతలో కానీ చేసినా దేశద్రోహమే అవుతుంది. అయితే ఈ నిర్వచనాన్ని కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా తమకు అనువుగా మలుచుకుని విచ్చలవిడిగా దేశద్రోహ కేసులు మోపుతున్నాయి. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం నిరసన తెలియజేసినప్పుడు ఈ చట్టాన్ని బాహాటంగా దుర్వినియోగం చేశారు. ఇలా మోపిన కేసుల్లో జనాన్ని ప్రభుత్వంపై తిరగబడమని కానీ, ప్రభుత్వాన్ని పడదోయమని కానీ, హింసను ప్రేరేపించిన సందర్భాలు కానీ నామ మాత్రంగా కూడా లేవు. ఇంకా విచిత్రం ఏమిటంటే 1948లో దేశద్రోహం అనే మాటను రాజ్యాంగం నుంచి తొలగించారు. రాజ్యాంగ నిర్ణాయక సభలో ఈ అంశంపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. 19(1)(ఎ) అధికరణం కింద రాజ్యాంగం నిర్నిబంధమైన వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను ప్రసాదించింది. కానీ అప్పుడూ దేశద్రోహ చట్టాన్ని అలాగే ఉంచేశారు. ఈ కేసుల్లో 3.3శాతం సందర్భాలలో మాత్రమే శిక్ష పడు తోంది. ఈ లోగా ప్రభుత్వానికి కిట్టని వారి నోళ్లు నొక్కేస్తున్నారు. వారు ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. పౌరసత్వం సవరణ చట్ట వ్యతిరేక ఉద్యమం జరిగినప్పుడు 3, 754 మంది మీద 25 దేశద్రోహ కేసులు మోపారు. ఇందులో గుర్తించింది 96 మందిని మాత్రమే. మిగతా వారు ఎవరో కూడా ప్రభుత్వానికి తెలియదు. జార్ఖండ్ లో పాతాళ్ గడి ఉద్యమ సమయంలో 2018లో వందలాది మంది ఆదివాసీలు ఈ చట్టానికి బలయ్యారు. ఇంత కిరాతకమైన చట్టాన్ని రద్దుచేయడానికి బదులు మరింత కఠినతరం చేయాలనుకోవడం కరడుగట్టిన నిరంకుశ లక్షణమే.

తరలిపోతున్న అపార ఖనిజ సంపద!

భారతదేశంలో అపారమైన ఖనిజ సంపద ఉంది. ప్రపంచంలోనే అత్యధిక ఖనిజ నిల్వలు ఉన్న మూడవ దేశం భారతదేశం. ఈ ఖనిజాలను ప్రజల జీవితానికి ఉపయోగపడేలా చేయాలి. భారతదేశంలోని ఖనిజ సంపద మీద దేశ ప్రజలందరికీ హక్కులు ఉంటాయని భారత జాతీయోద్యమం పేర్కొంది. ఖనిజ సంపద ఏ ఒక్కరి వ్యక్తిగత ఆస్తికాదని చెప్పింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గనుల, ఖనిజ సంపదను జాతి సంపదగా గుర్తించి వాటిని నియంత్రించి, అభివృద్ధిచేసి పరిరక్షించే బాధ్యతను ప్రభుత్వాలకు భారత రాజ్యాంగం అప్పగించింది.

దేశ పాలకులు ఆ రాజ్యాంగం అప్పగించిన బాధ్యతను కూడా ఉద్దేశ పూర్వకంగా విస్మరించి, ఇతర రంగాల మాదిరిగానే ఖనిజ రంగాన్ని కూడా సామ్రాజ్యవాద కంపెనీలకు, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాద కంపెనీల దోపిడీకి నెహ్రూ దగ్గర నుండి మోదీ వరకు నిలయంగా మార్చారు. మోదీ ప్రభుత్వం గత పాలకులకు మించి ఖనిజ సంపద, గనులు, అటవీ భూములను ప్రైవేట్ వ్యక్తుల, బహుళజాతి సంస్థల పరం చేస్తున్నది. ఫలితంగా దేశ ఖనిజసంపద విదేశాలకు తరలిపోతున్నది.

భారతదేశంలో 95 రకాల ఖనిజాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటి విలువ 24 లక్షల కోట్లు. 501 మిలియన్ టన్నుల బంగారు నిల్వలు ఉన్నాయి. దేశం నుంచి కొన్ని లక్షల టన్నుల ఖనిజాలు, ముడిలోహాలు బహుళజాతి సంస్థల కార్ఖానాలకు, గిడ్డంగులకు తరలివెల్తున్నాయి. వేల కోట్ల రూపాయల్లో వీటి విలువఉంటుంది. ఖనిజాల వ్యాపారం ద్వారా స్వదేశీ, విదేశీ వ్యాపారులు వేల కోట్లు సంపాయిస్తున్నారు. ఖనిజ నిక్షేపాలు ఎవరి నేలలో ఉన్నాయో, వాటిని ఎవరు తవ్వి తీస్తున్నారో, వారి జీవితాలు దుర్భరంగా మారాయి. ఖనిజాలు ఉన్న ప్రాంతాలు, ఆదివాసి, 5వ షెడ్యూల్, 1/70 ప్రాంతాలు ఒడిస్సాలో ఉన్న 2/ఆఫ్ చట్ట సవరణ ప్రాంతాలనుంచి ఖనిజ దోపిడీ నిరంత రాయంగా కొనసాగుతున్నది. ఒడిస్సా, జార్ఖండ్, చత్తీస్‌గడ్ రాష్ట్రాలలోని ఖనిజ నిల్వలను బహుళ జాతిసంస్థల అక్రమంగా తరలించుకు పోతున్నాయి. కర్ణాటకలో గాలి జనార్ధనరెడ్డి గనుల త్రవ్వకాలు దేశంలో పెద్ద సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

దేశంలో గనుల త్రవ్వకం, ఖనిజాల వాడకం బ్రిటిష్ వలస పాలనలోనే మొదలైంది. భారత ఉప ఖండంలోని సహజ వనరులను కొల్లగొట్టి తమ దేశానికి తరలించుకు పోయి ముడి సరుకుగా వాడు కున్నారు. ఈస్టిండియా కంపెనీ రోజుల్లోనే 1774లో రాణిగంజ్ లో మొదటి ఆధునిక బొగ్గు గనిని తెరవటంతో, భారతదేశంలో పరాయిదేశాల ఖనిజ తరలింపు ప్రారంభమైంది. 1851లో బ్రిటిష్ ప్రభుత్వం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాను ప్రారంభించింది. భూగర్భ గనుల శాఖను 1887లో ఏర్పాటు చేసింది. గనుల కోసం 1885లో భూ సంస్కరణల చట్టం చేసింది. 1923 భారత గనుల పాలనా చట్టం వంటి చట్టాలు చేసింది.

భారత పాలకులు ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగం గనులను, ఖనిజాభి వృద్ధిని కేంద్ర జాబితాలోనూ, రాష్ట్రాల జాబితాలోనూ చేర్చింది. చమురు క్షేత్రాలు, చమురు సంబంధిత ఖనిజ విలువలు, పెట్రోలియం, వాటి ఉత్పత్తులు, నియంత్రణ, అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తాయి. కేంద్ర ప్రభుత్వ పరిధిలో లేని ఇతర గనులు, ఖనిజాలు 1957 చట్టం ద్వారా భారత ప్రభుత్వం వృద్ధిరాష్ట్రాల పరిధిలోకి వస్తాయి. గనులు, ఖనిజాల (నియంత్రణ-అభివృద్ధి) చట్టం పేర్కొంది. ఈ చట్టం ప్రకారం అల్యూమినియం, రాగి, జింక్, సీసం, బంగారం, నికిల్ వగైరా ఖనిజాలు కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ కిందకు తెచ్చారు. ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, భారత అల్యూమినియం కంపెనీ, హిందూస్థాన్ జింక్ లిమిటెడ్, హిందూస్థాన్ కాపర్ లిమిటెడ్ వంటి కేంద్ర సంస్థలు ఏర్పడ్డాయి. భారత అల్యూమినియం కంపెనీని, హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ కంపెనీని ప్రైవేటీకరించారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఖనిజాభి వృద్ధి సంస్థలను ఏర్పాటు చేసుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా కొన్ని సంస్థలను ఏర్పాటు చేశాయి. ఇవన్నీ కూడా దేశ ప్రయోజనాలకు కాకుండా ప్రైవేట్ వ్యక్తుల, సంస్థల ప్రయోజనాలకే దోహద పడ్డాయి, పడుతున్నాయి. ప్రభుత్వ రంగంలోని గనుల శాఖలు, సంస్థలు ప్రజాను కూలంగా ఖనిజాలను వెలికితీసి ఉంటే, ఖనిజ సంపద ప్రజలకు అందేది, కాని అలా జరగలేదు. పాలకులు అలాంటి విధానాలు అమలు జరపలేదు.

1947 నుంచి భారత పాలకులు గనుల రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పే విధానాలనే అనుసరించారు. 1957 చట్టంలో గనుల త్రవ్వకానికి ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు అప్పగించే వీలు కల్పించారు. 1960లో వెలువడిన ఖనిజాల రాయితీ నిబంధనలు ప్రైవేట్ వ్యక్తుల, సంస్థల చేతికి ఖనిజ నిల్వలు కట్టబెట్టటానికి అవసరమైన విధి విధానాలు రూపొందించారు. ఆర్థిక సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత 1988లో వెలువడిన ఖనిజాల సంరక్షణ, అభివృద్ధి నిబంధనలు ప్రైవేటీకరణ క్రమాన్ని పెంచాయి. 1993లో మొదటిసారిగా తయారైన జాతీయఖనిజవిధానం పూర్తిగా ప్రపంచీ కరణ శక్తుల కనుసన్నల్లో బహుళ జాతిసంస్థల ప్రయోజనాలు నెరవేర్చే విధంగా తయారుచేశారు. 1994లో మరింతగా చట్ట సవరణ చేసి ఇనుప ఖనిజం, రాగి, మాంగనీస్, సీసం, క్రోమియం, ఖనిజం, జింక్, గంధకం, బంగారం, వజ్రాలు, నికిల్ మొదలైన ఖనిజాలలోకి పెద్దఎత్తున ప్రైవేట్ సంస్థల, బహుళ జాతిసంస్థల ప్రవేశానికి అవకాశం కల్పించారు. ఈ అవకాశం ద్వారా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యు కె, దక్షిణాఫ్రికాకు చెందిన బహుళ జాతిసంస్థలు నేరుగాను, దళారుల ద్వారా ఈ రంగాల్లోకి ప్రవేశించాయి. 2006లోనూ చట్టంలో అనేక మార్పులు జరిగాయి. ఖనిజాల వ్యాపారంలో విపరీత లాభాలు ఉండటంతో స్థానిక పెత్తందార్లు, వ్యాపారులు, అధికారులు, రాజకీయ నాయకులు కలగలసి మాఫియాగా ఏర్పడింది.ఈ మాఫియా బహుళ జాతి సంస్థలతో చేతులు కలిపింది. ప్రభుత్వ అనుమతులప్రకారం గనులు తవ్వితేనే 99శాతం లాభాలు వస్తుంటే, అక్రమత్రవ్వకాల ద్వారావచ్చే లాభాలను ఊహించటం కష్టం. వారికివచ్చే లాభాల్లో ఒకశాతం మాత్రమే ప్రభుత్వం పన్నుల ద్వారా వసూలు చేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ దేశంలోని ఖనిజ విలువలు, సంపదలో రెండవ స్థానంలోఉంది. రాష్ట్రంలో 50 పారిశ్రామిక ఖనిజాల వెలికితీత, ఉత్పత్తి జరుగుతున్న ది. పెద్దఎత్తున వీటి వ్యాపారంలో పారిశ్రామిక వేత్తలు వేల కోట్ల లాభాలు పొందుతున్నారు. దేశ ఖనిజ సంపద ద్వారా వ్యాపారం చేస్తున్న బహుళ జాతిసంస్థలు- కెనడాకు చెందిన ట్రాన్స్ వరల్డ్ గార్నెట్ కంపెనీ, యుఎస్ఏ కిచెందిన పిల్స్ డాడ్జ్ ఎక్స్ ప్లోరేషన్ కంపెనీ, ఆస్ట్రేలియాకు చెందిన బిహెచ్‌పి బిల్లిటన్, కెనడాకు చెందిన వెబుల్ క్రిక్ రిసోర్సెస్ కార్పొరేషన్, యుకె కి చెందిన రియో టింటో మినరల్స్ డెవలప్ మెంట్ లిమిటెడ్, దక్షిణాఫ్రికాకు చెందిన డి బీర్స్ కన్సాలిడేటెడ్ మైన్స్ లిమిటెడ్, దక్షిణ కొరియాకు చెందిన పోస్కో రష్యాకు చెందిన ఎంఎంకె, బ్రిటన్ నెదర్లాండ్‌కు చెందిన కోరస్, భారతదేశంలో జిందాల్ సౌత్ వెస్ట్ స్టీ, టాటా స్టీల్, ఎస్సార్ స్టీల్, యుకె కు చెందిన వేదాంత రిసోర్సెస్ మొదలైనవి ముఖ్యంగా ఉన్నాయి.

దేశ ఖనిజ వనరులను, అటవీ భూములను బడా పారిశ్రామిక వేత్తలకు, బహుళ జాతి సంస్థల కట్టబెట్టటానికి అడ్డంకిగా ఉన్న 1957 అటవీ హక్కుల పరిరక్షణ చట్టంలో మోదీ ప్రభుత్వం ముఖ్యమైన సవరణలు చేసింది. ఆ సవరణల ద్వారా అడ్డంకులు తొలగించి ఖనిజ సంపదను, అటవీ భూములను కార్పొరేట్ల పరం చేయటానికి సిద్ధమైంది. దీని ఫలితం ఆదివాసీ గిరిజన ప్రజలు భూములు, నివాస ప్రాంతాలు కోల్పోయి నిరాశ్రయులు అవుతున్నారు, అవబోతున్నారు. దేశ ప్రజలు సంపద కోల్పోతున్నారు.

బొల్లిముంత సాంబశివరావు, సెల్: 9885983526

ఇప్పటికీ మారని రైతు బతుకు

భారతదేశం వ్యవసాయక దేశం. దేశంలో సుమారు 90 శాతానికిపైగా సన్న, చిన్న కారు రైతులు ఉన్నారు. వ్యవసాయంలో ప్రధాన భూమికరైతుదే. అలాంటి రైతు బతుకే కాలక్రమేణా అధ్వానంగా మారుతోంది. పాలకులు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా వారి తలరాతలు మారటంలేదు. దీనికి ముఖ్య కారణం మానవునిచేతిలోలేని వాతావరణ మార్పుల కారణంగా ఈ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవడం, దీనికి పలు ఇతర సమస్యలు తోడవడం రైతు బతుకును మరింత ఛిద్రం చేస్తోంది. ఇంకో విచిత్రమేమిటంటే పంట అధికంగా పండినా, తక్కువగా పండినా లేదా అసలు పండక పోయినా రైతుకు నష్టమే. ఇన్ని సమస్యల మధ్య రైతులు బతుకు ఈడ్చుకుంటూ రావడం కత్తి మీద సామే. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఫిబ్రవరి 2019లో పియం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అన్నదాతల బతుకులు మెరుగుపరచే ఉద్దేశంతో ప్రవేశపెట్టింది. తెలంగాణ, జార్ఖండ్, ఒడిస్సా, రాష్ట్రాల్లో అప్పటికే ఈ పథకం అమలు చేయడంతో సత్ఫలితాలు ఆయా రాష్ట్రాల్లో ఇవ్వడంచూసి, కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందని కొందరి భావన. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని రైతులతో బాటు భూమిలేని కౌలు రైతులకు కూడా వర్తింప జేయడం ప్రస్తుత ప్రభుత్వం కూడా దీనిని కొనసాగించడం గమనార్హం.

ఈ పథకం కింద దేశవ్యాప్తంగా రెండు హెక్టార్లకు మించకుండ ఉన్న వ్యవసాయ కుటుంబాలకు ఏటా రు.6,000 మూడు విడతల్లో రు.2000 చొప్పున చెల్లిస్తారు. ఈ పథకానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించ డానికి ప్రభుత్వం హెల్ప్‌లైన్ కూడా ఏర్పాటుచేసింది. ఇవన్నీ టోల్ ఫ్రీ నెంబర్లు. ప్రతీ ఏడాది తొలివిడత సాయం నిధులు ఏప్రిల్- జూన్ మధ్య విడుదల అవుతుంటాయి. ఈ పథకం నూటికి నూరు పాళ్ళు కేంద్రమే ఆర్థికసాయాన్ని రాష్ట్రాలతో సంబంధంలేకుండా అందజేస్తుంది. లబ్ధి దారులు ప్రతి ఏటా ఈ పథకంకింద తమపేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అవసరమైతే దగ్గరలోని, కామన్ సర్వీసు సెంటరుకు వెళ్ళి పేరు నమోదు చేసుకోవచ్చు. ఇంతవరకు 13 వాయిదాలు ఈ పథకం కింద విడుదల అయ్యాయి. అంటే, ఒక్కో లబ్దిదారునికి ఇంతవరకు రు.26,000 ముట్టాయి. అయితే ఈ స్వల్ప మొత్తం రైతుల దుస్థితిని పరిష్కరించలేదు. వ్యవసాయ ఖర్చుల భారం కూడా కొంత తగ్గుతుంది. దీనికి రాష్ట్రాలు అందిస్తున్న నగదు కలిపితే రైతుకు మరింత లబ్ధి చేకూరుతుంది. ఫలితంగా గ్రామీణ సమీప పట్టణ వస్తు, సేవలకు అదనపు డిమాండు ఏర్పడుతుంది. ఈ పథకం కౌలు రైతులను పట్టించుకోకపోవడం పలు విమర్శలకు గురి అవుతోంది. దేశంలో అత్యధికంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నది వారే. వీరికి చెందవలసిన నగదును భూ యజమానులు అనుభవించడం న్యాయం కాదు. ఈ విషయంలో వారు పెద్దమనసు చేసుకోవాలి. ఈ సాయాన్ని కౌలురైతుకు అందించాలి.

ఇతర లోపాల విషయానికొస్తే, ఈ పథకంలో రైతు నిజంగా సేద్యం చేస్తున్నాడా లేదా తన పొలాన్ని కౌలుకిచ్చాడా అన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించే యంత్రాంగం కోరవయింది. ముఖ్యమైనదే మిటంటే, రెండెక్టార్ల భూమిని కోలమానంగా నిర్ణయించడం, ఒకొక్క రాష్ట్రంలో లేదా ప్రాంతంలో భూమి ఉత్పాదకత ఒక్కోలాగుంటుంది. వాతావరణం, వసతులు, నేలస్వభావం వంటి వాటిపై దిగుబడి ఆధారపడి వుంటుంది. ఇలాంటి సమస్యలతో సతమత మవుతున్న గ్రామాలు అనేకం. కొన్ని ప్రాంతాల్లో యజమానికి 20 ఎకరాలున్నా దిగుబడి అంతంత మాత్రమే. మరికొన్నిప్రాంతాల్లో రెండెకరాలున్నపంట భారీగా పండుతుంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని భూ పరిమితులను నిర్ణయించాలే తప్ప దేశవ్యాప్తంగా ఒకే పరిమితిని నిర్ణయించడం సమంజసం కాదు. ఈ పథకం పూర్తిస్థాయిలో అమలుకు అసలు రైతుల సమాచారం చాలా అవసరం. భూ రికార్డులు పూర్తిస్థాయిలో దేశవ్యాప్తంగా డిజిటలైజేషన్ చేసిననాడే ఈ పథకం విజయవంత మవుతుంది. కాని కొన్ని రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తికాలేదు. కౌలు రైతులకు సంబంధించిన వివరాలు కూడా కొన్ని రాష్ట్రాల్లో లేవు ఈ పథకంలో అర్హులైన రైతులు తమ కష్టాలను, విన్నపాలను చెప్పుకొనే యంత్రాంగం లేదు. తాజా బడ్జెట్లో ఈ పథకం కింద అర్హులను కుదించి గత ఏడాది కన్నా నిధులు తగ్గించారు. గతంలో రు.68,000 కోట్లు కేటాయించినా, పలు అంక్షలతో రు 60 వేలు కోట్లే చెల్లించారు. ఈసారి కూడా అంతే మొత్తాన్ని బడ్జెట్‌లో కేటాయించారు.

యస్.వై. విష్ణు, సెల్ : 9963217252.

పోలవరం ఇక బ్యారేజే!



వి. శంకరయ్య

పోలవరం ప్రాజెక్టు భవితవ్యం ప్రమాదంలో పడింది. ప్రజా ఉద్యమాలతో తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచడం కుదరదు. ఈ పూర్వ రంగంలో కమ్యూనిస్టు పార్టీ నేత రామకృష్ణ వామపక్ష పార్టీలతో కలసి ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా పాదయాత్ర చేపట్టడం ముదావహం. కేంద్ర మంత్రి షెకావత్ ఈ నెల 2 వతేదీ నిర్వహించిన సమీక్ష సమావేశం తర్వాత వెలువడిన అధికారిక వార్తలతో పాటు కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన ప్రకటన పరిశీలించితే పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టుగా కాకుండా ఒక బ్యారేజీగా మిగిలి పోనున్నది. తాజాగా కేంద్ర ఆర్థిక శాఖ నిధుల్లో కూడా కోత విధించడంతో అది కూడా సాధ్యం కాదేమో! కేంద్ర మంత్రి జరిపిన సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు రెండవ డిపిఆర్ పెట్టుబడి అనుమతి ప్రస్తావనకే రాలేదు. రాష్ట్రం వేపు నుండి అభ్యర్థన లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 2010-11 నాటి షెడ్యూల్ రేట్లతో రూ.16010.45 కోట్లతో ప్లానింగ్ కమిషన్ ఆమోదించిన తొలి డిపిఆర్ తప్ప ఇన్నేళ్లు గడిచినా పోలవరం ప్రాజెక్టు రెండవ డిపిఆర్ కేంద్రం ఆమోదించ లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా ఒక ఒప్పందానికి వచ్చి పోలవరం ప్రాజెక్టు తొలి దశ అంటే 41.15 మీటర్లు(135 అడుగులు) వరకు నీరు నింపేందుకు ఎంత వ్యయ మౌతుందనే అంశానికే పరిమితమయ్యారు. 41.15 మీటర్ల వరకే నీళ్లు నిలిపేందుకు అయ్యే వ్యయం 17,144 కోట్ల రూపాయలు అవసరమని సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం కోరితే కేంద్ర ఆర్థిక శాఖ తోక కోసి 12,911 మాత్రమే ఇచ్చేందుకు సిద్ధ పడింది. ఇందులోనే మరమ్మతులకు రెండు వేల కోట్లు చూపెట్టింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్లు 2025 జూన్ కు కూడా తొలి దశ పనులు 41.15 (135 అడుగులు) మీటర్ల వరకైనా నీళ్లు నింపేందుకు. నష్ట పరిహారం పునరావాసానికి ఈ నిధులు ఏ మాత్రం చాలవు.

45.72 మీటర్లు (150 అడుగులు) పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తే 194. 60 టియంసిల నీళ్లు నిల్వ చేయ గల పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్లకే (135 అడుగులు) పరిమితమైతే వంద టియంసిలలోపు మాత్రమే నీళ్లు నిల్వ చేయ గలరు.ఇదే జరిగితే వరద రోజుల్లో తప్ప మిగిలిన కాలంలో కుడి ఎడమ కాలువల ద్వారా గ్రావెటీతో గోదావరి జలాలను తరలించడం కుదరదు. పోలవరం కుడి కాలువ స్పిల్ లెవల్ 40.232 మీటర్లయితే ఎడమ కాలువ స్పిల్ లెవల్ 40.54 మీటర్లు మాత్రమే. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే కొనే కాబోలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పోలవరం నుండి 778 కోట్ల రూపాయల వ్యయంతో గత ఏడాది ఎత్తిపోతల పథకం ప్రకటించి టెండర్ కూడా ఖరారు చేశారు. నీటి ఎద్దడి రోజుల్లో గోదావరి జలాలు ఎత్తి పోసుకొనేందుకు పట్టి సీమ పథకం పూర్తయి వున్నా అది తెలుగు దేశం హయాంలో నిర్మించారు. కాబట్టి దాని పొడ గిట్టని ముఖ్యమంత్రి మరో ఎత్తి పోతల పథకం ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్ల వరకే నీళ్లు నిల్వ చేస్తే ఉత్తరాంధ్రలో దాదాపు 8 లక్షల ఎకరాలకు సాగునీరు 30 లక్షల మందికి తాగునీరు అందివ్వగల ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కథ ముగిసినట్లే. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు నుండి కృష్ణా బ్యారేజీకి తరలించవలసిన 80 టియంసిలు వరద రోజుల్లో తప్ప వీలుకాదు. వరద రోజుల్లో కృష్ణాలో ఏలాగూ నీళ్లు వుంటాయి. ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్నాడు ఎత్తిపోతల పథకంతో పాటు గోదావరి జలాలను డెల్టాతో పాటు సాగర్ కుడి కాలువకు ఉపయోగించి తద్వారా మిగిలే కృష్ణా జలాలను గొంతెండి పోతున్న రాయలసీమ ప్రాంతానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆమోదించిన బనకచర్ల క్రాస్ అనుసంధానం ద్వారాగాని పోతురెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి నీళ్లు తరలించడం అటకెక్కినట్లే.

పోలవరం ప్రాజెక్టుకు ఈ దుర్గతి పట్టడానికి పూర్వ రంగం లేక పోలేదు. 2019 ఎన్నికల అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అలాయ్ బలాయ్ ఆడుకున్న రోజుల్లో సాక్షాత్తు తెలంగాణ చట్ట సభలో కెసిఆర్ పోలవరం ఎత్తు తగ్గించేందుకు జగన్మోహన్ రెడ్డి అంగీకరించారని ప్రకటించినపుడు ఎపి ప్రభుత్వ వేపు నుండి ఖండన ఏమాత్రం రాలేదు. పైగా 2020 లోనే పోలవరం సమీక్ష సందర్భంగా పోలవరంలో ఒకే దఫా పూర్తి స్థాయిలో నీళ్లు నిల్వ చేసే అవకాశం లేదని డ్యాం సేఫ్టీ అండ్ స్టెబిలిటీ ప్రొటోకోల్ సిద్ధాంతాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెర మీదకు తెచ్చారు. అంతిమంగా గత ఏడాది ఎత్తిపోతల పథకం ప్రకటించినపుడే పోలవరం ఒక బ్యారేజీగానే మిగిలి పోనున్నదని సాగునీటి రంగం నిపుణులు భావించారు.

ఎక్కడైనా సరే ఏ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టినా మొదటి లబ్దిదారులు మునక ప్రాంతాల్లో ఉన్న నిర్వాసితులే. కాని పోలవరం నిర్వాసితులను అందరూ కలిసి గోదావరి వరద పాలు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు 41.15 మీటర్ల వరకే పరిమిత మైనా (తాజాగా కేంద్ర ఆర్థికశాఖ ఆదేశాలతో అసాధ్యం) ఇంకా 2,910 ఎకరాలు భూసేకరణ జరగాలి. అధికారిక గణాంకాల మేరకు ఇప్పటి వరకు 8280 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినా ఇంకా దాదాపు 8886 కుటుంబాలను తరలించి పునరావాసం కల్పించ వలసి వుంది. ఈ ఏడు గోదావరికి వరద వచ్చేలోపు నిర్వాసితుల తరలింపు పునరావాసం కల్పించడం కుదరదు

ఈ లెక్కలు 41.15 మీటర్ల వరకే. ఇదిలా వుండగా అకస్మాత్తుగా వచ్చే వరదలకు వేలాది కుటుంబాలు రోజుల తరబడి కొండలు గుట్టలపై గడిపే ప్రమాదం గత కొన్నేళ్లుగా చూస్తున్నాము.

పోలవరం ప్రాజెక్టుకు ఇంత దుర్గతి పట్టడానికి కేంద్ర ప్రభుత్వం తొలి ముద్దాయి. రాష్ట్ర విభజన చట్టం ద్వారా చట్ట బద్ధత గల ప్రాజెక్టు గురించి కేంద్రాన్ని నిలదీయ లేని రాష్ట్ర ప్రభుత్వం రెండవ ముద్దాయి. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 90 మేరకు పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు సబ్ సెక్షన్ (1)మేరకు పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన నిధులతో నిర్మించాలి. అటవీ పర్యావరణ తదితర అనుమతులు తీసుకురావడం నష్ట పరిహారం పునరావాసం బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వానిదే. విభజన చట్టంలో ఇందుకు ఎట్టి మినహాయింపులు లేవు. అయినా 2013-14 షెడ్యూల్ రేట్లకే పరిమితమౌతామని ఇందులో కూడా సాగునీటి వ్యయం రూ.20,398.81 కోట్లు మాత్రమే తాము భరిస్తామని తాజాగా వెలువడిన కేంద్ర ఆర్థికశాఖ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

2019 ఫిబ్రవరిలో తెలుగు దేశం హయాంలో ఎంతో కసరత్తు చేసిన తర్వాత కేంద్ర జలశక్తి శాఖకు చెందిన సాంకేతిక సలహా మండలి ప్రాజెక్టు నిర్మాణ వ్యయం 2017-18 షెడ్యూల్ రేట్ల ప్రకారం రూ.55,548 కోట్ల రూపాయలుగా ఆమోదించింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోనికొచ్చిన తర్వాత కాంట్రాక్టరు మార్పు పైగా అవినీతి వెలికి తీతతో సంవత్సరం కాలం గడిచి పోయింది. తిరిగి 2020 మే నెలలో గాని కేంద్ర జల శక్తి శాఖకు చెందిన సవరణ వ్యయం అంచనాల కమిటీ సమావేశం కాలేదు. ఆ కమిటీ కూడా ఒకే మారు రెండు డిపిఆర్‌లు ఆమోదించడం గమనార్హం. 2017లో కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిందనే సాకు చూపి 2013-14 షెడ్యూల్ రేట్ల ప్రకారం కేవలం సాగునీటి వ్యయం 20 398.81 కోట్లుగా ఒక డిపిఆర్ 2017-18 షెడ్యూల్ రేట్ల ప్రకారం సాగునీటి వ్యయం 35 950. 16 కోట్లుగా మరో డిపిఆర్ ఆమోదించింది. ఫలితంగా కేంద్ర ఆర్థిక శాఖ 2013-14 షెడ్యూల్ రేట్లకే పరిమితమౌతోంది. అయితే 2019 లో సాంకేతిక సలహా మండలి రెండవ డిపిఆర్ ఆమోదించే సమయంలో 2017 లో కేంద్ర మంత్రి వర్గం తీర్మానాన్ని కేంద్ర జల శక్తి శాఖ ఎందుకు బయటపెట్టలేదు? రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 46 (3)మేరకు రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు.

అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ 2019 ఫిబ్రవరి 20 వతేదీ విభజన చట్టం రాజ్యసభలో చర్చల సందర్భంగా మాట్లాడుతూ బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ప్యాకేజీ ఎపిలో వెనుక బడిన రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు అమలు జరుగుతుందని ప్రకటించారు. ఈ పథకానికి మంగళం పాడారు. అయితే గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వ్యాపించి వున్న బుందేల్ ఖండ్ ప్రాంతానికి తాగు, సాగునీరు అందించేందుకు యమునా నది ఉప నదులైన కెన్ - బెత్వా నదుల అనుసంధానం పేర ప్రాజెక్టు చేపట్టింది. దీని నిర్మాణ వ్యయం 2020 - 21 షెడ్యూల్ రేట్ల ప్రకారం 44 605 కోట్లు మొత్తం కేంద్రమే భరిస్తోంది. పైగా ఇందుకు చెందిన కేంద్ర బడ్జెట్ లో నిధులు కేటాయించడమే కాకుండా తాగునీటి విద్యుత్ వ్యయం కూడా కేంద్రం భరించుతోంది. అదే చట్ట బద్ధత గల పోలవరం ప్రాజెక్టుకు ఏనాడు కేంద్ర బడ్జెట్ లో నిధులు కేటాయించ లేదు. పైగా తాగునీటి వ్యయం మినహాయించింది. .పోలవరం యెడల చిన్న చూపు వ్యక్తం చేస్తూ అదే సమయంలో బుందేల్ ఖండ్ కన్నా దుర్భరంగా వున్న రాయలసీమలో ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించలేదు. రాష్ట్ర ప్రభుత్వమూ అడగ లేదు.

విశ్రాంత పాత్రికేయులు, 9848394013

భద్రత కోసం రూ. లక్ష కోట్లు

- ట్రాక్ పునరుద్ధరణ వ్యయంలో స్థిరమైన పెరుగుదల
- రైల్వేల అధికారిక పత్రం వెల్లడి

న్యూఢిల్లీ : రైల్వేలు ట్రాక్ పునరుద్ధరణ వ్యయంలో స్థిరమైన పెరుగుదలతో 2017-2018, 2021-22 మధ్య భద్రతా చర్యల కోసం రూ.1 లక్ష కోట్లకు పైగా ఖర్చు చేశాయని, అధికారిక పత్రం ప్రకారం వెల్లడించింది. ఒడిశాలోని బాలాసోర్‌లో శుక్రవారం 300 మంది వరకు ప్రాణాలు కోల్పోయి 1,000 మందికి పైగా గాయపడిన మూడు రైళ్ల ప్రమాదంపై విమర్శల దాడి చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఉదహరించిన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా నివేదికకు రైల్వే త్వరలో సమాధానం ఇస్తుందని ప్రభుత్వ వర్గాలు సూచించాయి. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ 'అన్ని ఉత్త భద్రతా వాదనలు బహిర్గతమయ్యాయి' అని సోమవారం ఖర్గే ప్రధాన మంత్రి మోదీకి లేఖ రాశారు. రైల్వే భద్రత క్షీణించడంపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని ఆయన అన్నారు. 2022 కాగ్ నివేదిక 'భారతీయ రైల్వేలలో పట్టాలు తప్పడం' రాష్ట్రీయ రైల్ సంరక్షా కోష్ (ఆర్ఆర్ఎస్‌కే) కోసం నిధులు భారీగా 79 శాతం తగ్గించబడిందని ఖర్గే తన లేఖలో ఎత్తి చూపారు. ఏటా దాదాపు రూ.20 వేల కోట్లు వస్తాయని బడ్జెట్ సమర్పణలో పేర్కొన్నా అది జరగలేదని, ట్రాక్ పునరుద్ధరణ పనులకు అవసరమైన నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. అయితే, 2017-18 నుంచి 2021-22 వరకు రైల్వేలు ఆర్ఆర్ఎస్‌కే పనులకు రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు అధికారిక పత్రం వెల్లడించింది. ఫిబ్రవరి 2022లో, ప్రభుత్వం ఆర్ఆర్ఎస్‌కే చెల్లుబాటును 2022-23 నుంచి మరో ఐదు సంవత్సరాలు పొడిగించింది. అయితే, 2017-18 నుంచి 2021-22 మధ్య కాలంలో ట్రాక్ పునరుద్ధరణపై వ్యయం స్థిరమైన వృద్ధిని ప్రతిబింబించిందని అధికారిక పత్రం పేర్కొంది. ట్రాక్ పునరుద్ధరణకు 2017-18లో రూ.8,884 కోట్ల నుంచి 2020-21లో రూ.13,522 కోట్లకు, 2021-22లో రూ.16,558 కోట్లకు పెరిగిందని వివరించింది.

మొత్తంగా, ఈ కాలంలో రైల్వే ట్రాక్ పునరుద్ధరణ కోసం రూ.58,045 కోట్లు వెచ్చించింది. 'భారతీయ రైల్వేలలో పట్టాలు తప్పడం'పై కాగ్-2022 నివేదిక సంఖ్య 22 గత ఏడాది డిసెంబరు 21న పార్లమెంటులో సమర్పించారు. ప్రభుత్వ వర్గాల ప్రకారం, కాగ్ నివేదికలో ఆర్ఆర్ఎస్‌కే వినియోగం పరిధి మూడు సంవత్సరాలకు... 2017-18, 2018-19, 2019-20కు పరిమితమైంది. అందువల్ల, భారతీయ రైల్వేలు ట్రాక్ పునరుద్ధరణ, భద్రత సంబంధిత పనులు రెండింటిపై చేపట్టిన వాస్తవ వ్యయంపై ఇది పాక్షిక చిత్రాన్ని అందిస్తుంది. ఆచరణలో ఉన్నట్లుగా, ఈ నివేదికలో లేవనెత్తిన అన్ని సమస్యలపై సవివరమైన సమాధానం త్వరలో పంపబడుతోందని వివరించింది. 'ఖర్చుపై వాస్తవ స్థితి, ఉదహరించిన గణాంకాలకు పూర్తిగా విరుద్ధం. భారతీయ రైల్వేలలో ట్రాక్ పునరుద్ధరణపై ఖర్చు వాస్తవ ధోరణి 2004-05 నుంచి 2013-14 వరకు రూ.47,039 కోట్ల నుంచి 2014-15 నుంచి 2023-24 వరకు రూ.1,09,023 కోట్లకు పెరిగింది.

అది రెండింతల కంటే ఎక్కువ పెరుగుదల' అని పేర్కొంది. అదేవిధంగా, ట్రాక్ పునరుద్ధరణ, వంతెనలు, లెవెల్ క్రాసింగ్, రైల్వే ఓవర్ అండ్ అండర్ బ్రిడ్జిలు, సిగ్నలింగ్ పనులతో సహా భద్రత సంబంధిత పనులపై వ్యయం 2004-05 నుంచి 2013-14 వరకు రూ.70,274 కోట్ల నుంచి రూ.1,78,012 కి పెరిగింది. 2014-15 నుంచి 2023-24 మధ్య కాలంలో రెండున్నర రెట్లు ఎక్కువ పెరుగుదల అని వివరించింది.

రైలు ప్రమాద ఘటన
మరో ముగ్గురి మృతి
మృతుల సంఖ్య 278గా పేర్కొన్న రైల్వేలు

భువనేశ్వర్ : ఒడిశా రైలు ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో ముగ్గురు మరణించడంతో అధికారిక మరణాల సంఖ్యను 278గా రైల్వేలు పేర్కొన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం సవరించిన సంఖ్య 275 వద్ద ఎటువంటి మార్పు లేదు. జూన్ 2న జరిగిన ప్రమాదంలో 278 మంది మరణించడమే కాకుండా 1,100 మంది గాయపడ్డారని ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) రింకేష్ రే సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 275 వద్ద మృతుల సంఖ్యను పేర్కొనడంపై 'కాలానుగుణంగా గణాంకాలు మారుతాయి' అని ఆయ అన్నారు. మృతుల సంఖ్యను ముందుగా 288గా పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం 275కి సవరించింది. కొన్ని మృతదేహాలను రెండుసార్లు లెక్కించినట్లు వెల్లడించింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, రైల్వే శాఖ మాజీ మంత్రి కూడా అయిన మమతా బెనర్జీ, తమ రాష్ట్రానికి చెందిన 61 మంది మరణించారని, 182 మంది గల్లంతయ్యారని పేర్కొంటూ గణాంకాలను ప్రశ్నించారు. గాయపడిన 1,100 మందిలో 200 మంది కంటే తక్కువ మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని రే చెప్పారు. 278 మృతదేహాలలో 177 మందిని గుర్తించామని, ఇంకా 101 మందిని గుర్తించాల్సి ఉందని, ఈ నిర్ధారించని మృతదేహాలను ఆరు వేర్వేరు ఆసుపత్రుల్లో ఉంచామని ఆయన వివరించారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, చత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో గల్లంతయిన వ్యక్తులను గుర్తించేందుకు రైల్వే సిబ్బందిని నియమించిందని రే చెప్పారు. మృతదేహాలను శాస్త్రీయ పద్ధతిలో భద్రపరుస్తామన్నారు.

మాటల్లో చెప్పలేని విషాదం
కటక్‌లో క్షతగాత్రులను పరామర్శించిన మమత

కటక్ : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం కటక్‌లోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో గాయపడిన ప్రయాణీకులను పరామర్శించారు. ఆమె ఎస్‌సీబీ వైద్య కళాశాల, ఆస్పత్రిలోని కంటి, శస్త్రచికిత్స విభాగాన్ని సందర్శించి క్షతగాత్రులతో మాట్లాడారు. వారికి అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. 'మేము గాయపడిన ప్రయాణీకులకు అన్ని విధాలుగా సహాయం చేయడానికి ప్రయత్నిస్తున్నాము. జూన్ 2న ప్రమాదం జరిగిన రాత్రి గాయపడిన ప్రయాణీకులను జాగ్రత్తగా చూసుకోవడానికి వైద్యులు, నర్సులు, అధికారుల బృందాలను ఇప్పటికే పంపించాము' అని ఆమె ఇక్కడ విలేకరులతో అన్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 57 మంది గాయపడిన ప్రయాణికులు ఎస్‌సీబీ వైద్య కళాశాలలో ఉన్నారని బెనర్జీ చెప్పారు. 'కొందరు అవయవాలను కోల్పోయారు. మరికొందరు కళ్లు కోల్పోయారు. ఇది మాటలతో వర్ణించలేని విషాదం' అని ఆమె విలేకరులతో అన్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 103 మంది ప్రయాణికుల మృతదేహాలను ఇప్పటివరకు గుర్తించామని, 30 మంది తప్పిపోయారని బెంగాల్ ముఖ్యమంత్రి చెప్పారు. 'నేను ఇప్పటికే మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.1 లక్ష ఎక్స్‌గ్రేషియా ప్రకటించాను. రైలులో ప్రయాణిస్తూ మానసిక, శారీరక ఒత్తిడికి గురైన సుమారు 900 మందికి రూ.10 వేలు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ ప్రమాద ఘటన వెనుక ఉన్న నిజం బయటకు రావాలని కోరుకుంటున్నట్లు బెనర్జీ అన్నారు. 'నేను ప్రజలతో ఉండాలనుకుంటున్నాను. చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. నిజం బయటకు రావడం చాలా ముఖ్యం' అని అన్నారు. బెనర్జీ వెంట మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రి శశి పంజా, ఆర్థిక మంత్రి చంద్రిమా భట్టాచార్జీ ఉన్నారు. భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో చేరిన గాయపడిన ప్రయాణీకులను మంత్రులిద్దరూ పరామర్శించారు.

ఇదిలావుండగా, రైలు ప్రమాదంలో మరణించిన ప్రయాణికుల కుటుంబాలను పరామర్శించేందుకు పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి.ఆనంద బోస్ దక్షిణ 24 పరగణాలలోని బసంతీని సందర్శించారు. 'ఇది చాలా విచారకరమైన పరిస్థితి. ఇది మానవ దుస్థితికి సంబంధించిన సందర్భం. అందరి కోసం, మనందరం నిలబడాల్సిన సమయం ఇది' అని ఆయన అన్నారు.

విద్యుదాఘాతంతోనే 40 మంది మృతి

భువనేశ్వర్: ఒడిశాలో గతవారం మూడు రైళ్లు ఢీకొన్న ఘోర ప్రమాదంలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు 278 మంది దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. అయితే ఇందులో కనీసం 40 మంది విద్యుదాఘాతం వల్లే ప్రాణాలు కోల్పోయినట్లు భావిస్తున్నామని సహాయ చర్యలు పర్యవేక్షించిన పోలీసు అధికారి ఒకరు చెప్పారు. ప్రమాదం తర్వాత ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టిన రెస్క్యూ సిబ్బంది పట్టాలు తప్పిన బోగీల నుంచి మృతదేహాలను బయటకు తీశారు. అయితే ఇందులో కనీసం 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలైన ఆనవాళ్లు కన్పించలేదని ఆ అధికారి తెలిపారు. ఇదే విషయాన్ని ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) కూడా తమ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో లైవ్ ఓవర్‌హెడ్ కేబుల్ తెగి బోగీలపై పడిందని, దీంతో విద్యుదాఘాతం జరిగిందని రైల్వే పోలీసులు తెలిపారు. "కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్ రైలును ఢీకొట్టిన తర్వాత ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. ఇందులో కొన్ని పక్కనున్న ట్రాక్‌పై పడ్డాయి. అదే సమయంలో ఆ మార్గంలో బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ రావడంతో ఆ రైలు పట్టాలు తప్పిన కోరమాండల్ బోగీలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఓవర్‌హెడ్ లోటెన్షన్ లైన్ విద్యుత్ తీగలు తెగి బోగీలపై పడ్డాయి. దీంతో విద్యుదాఘాతం కూడా చోటుచేసుకుంది. బోగీల మధ్య నలిగిపోవడంతో చాలా మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమయ్యాయి. దాదాపు 40 మృతదేహాలపై ఎలాంటి గాయాలు కన్పించలేదు. రక్తస్రావం జరిగిన ఆనవాళ్లూ లేవు. బోగీలపై లోటెన్షన్ వైర్ పడి విద్యుత్ ప్రసరించడంతో వీరు విద్యుదాఘాతానికి గురై చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నాం" అని ఆ పోలీసు అధికారి తెలిపారు. ఈ ప్రమాదంపై ఒడిశా పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంతో ప్రాణాలకు హాని కలిగించడం, మరణాలకు కారణమవ్వడం వంటి అభియోగాలతో ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలుస్తోంది.

చనిపోయాడనుకొని ట్రక్కులో ఎక్కించారు

కోల్‌కతా: ఒడిశా రైలు ప్రమాదంలో గాయపడిన ఒక వ్యక్తిని చనిపోయినట్టు భావించి మృతదేహాలు తరలించే లారీలో ఎక్కించారు. కానీ, తను ప్రాణాలతోనే ఉన్నానని సహాయక సిబ్బందికి చెప్పడంతో వెంటనే ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు పశ్చిమబెంగాల్‌కు చెందిన విశ్వజిత్ మాలిక్ కూడా షాలిమర్ స్టేషన్‌లో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. రైలు ప్రమాదంలో విశ్వజిత్ కుడి చేతికి తీవ్ర గాయం కావడంతో ఎటూ కదలలేకపోయాడు. అంతలో కొంతమంది రైలులో చిక్కుకుపోయిన వారిని బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయం బాధిస్తున్నా విశ్వజిత్ తన శక్తినంతా కూడదీసుకుని రైలు నుంచి బయటపడ్డాడు. ఎటూ కదల్లేని పరిస్థితి. సహాయం కోసం పిలుద్దామన్నా నోట్లోంచి మాట రావడంలేదు. మెల్లిగా కళ్లు మూతలుపడుతున్నాయి.. చుట్టుపక్కల చూసేందుకు ప్రయత్నిస్తున్నా సాధ్యంకాలేదు. కొద్దిసేపటి తర్వాత మెలకువ వచ్చింది. తన జేబులో ఉన్న ఫోన్ మోగుతున్నట్లు అనిపించింది. లేచిచూస్తే.. తనకి రెండు వైపులా కొంతమంది అచేతనంగాపడి ఉన్నారు. అప్పుడు విశ్వజిత్‌కు తను కూడా చనిపోయానని భావించి, మృతదేహాలను తరలించేందుకు ఏర్పాటు చేసిన లారీలో ఎక్కించారని అర్థమైంది.

వెంటనే అక్కడున్న వారికి తాను బతికే ఉన్నానని తెలిసేలా తన ఎడమచేతిని పైకెత్తాడు. గమనించిన సహాయక సిబ్బంది విశ్వజిత్‌ను చికిత్స కోసం గోపాల్‌పూర్ ఆసుపత్రికి తరలించారు. తర్వాత తన తండ్రికి ఫోన్‌లో పరిస్థితి వివరించడంతో ఆయన గోపాల్‌పూర్ ఆస్పత్రికి చేరుకుని విశ్వజిత్‌ను కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విశ్వజిత్ ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఒకవేళ తనకు మెలకువ రాకపోతే చనిపోయిన వారితోపాటు తనను కూడా తరలించేవారని, దేవుడి దయతో బతికి భయపడ్డానని విశ్వజిత్ చెమ్మగిల్లిన కళ్లతో చెప్పాడు.

బడ్జెట్లను కలపడమే కేంద్రం చేసిన ఘోర తప్పిదం: వీరప్ప మొయిలీ

న్యూఢిల్లీ: రైల్వేలకు ఇంతకుముందు ప్రత్యేకంగా ఉన్న బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌లో విలీనం చేయడమే ఎన్డీయే ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరప్ప మొయిలీ అన్నారు. అలా బడ్జెట్లను కలిపివేయడం వల్లనే రైల్వేలపై ప్రత్యేక దృష్టి లేకుండా పోయిందని చెప్పారు. ఒడిశాలోని బాలేశ్వర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదం తీవ్ర విషాదం నింపిన నేపథ్యంలో మొయిలీ పై వ్యాఖ్యలు చేశారు. గతంలో మాదిరిగా రైల్వే, సాధారణ బడ్జెట్లు మళ్లీ వేర్వేరుగా ప్రవేశపెట్టాలని కోరారు. రైల్వే వ్యవస్థలో మౌలికమైన సమస్యలను సరిచేయకుండా, తగినంత ఆధునికీకరణ, సాంకేతికతను అందిపుచ్చుకోకుండా కేంద్ర ప్రభుత్వ పెద్దలు బుల్లెట్ రైళ్ల గురించి మాట్లాడుతున్నారని మొయిలీ విమర్శించారు. 2017 నుంచి రైల్వే బడ్జెట్‌ను కేంద్ర బడ్జెట్‌తో విలీనం చేయడం ద్వారా రైల్వేలపై ప్రత్యేక దృష్టి లేకుండా పోయిందన్నారు.

ఇదే ఎన్డీయే ప్రభుత్వం చేసి పెద్ద తప్పుగా పేర్కొన్నారు. రైల్వేల్లో భద్రత, ఆధునికీకరణ అంశాలను పట్టించుకోకుండా అత్యంత వేగంగా వెళ్లే రైళ్లపై దృష్టిసారించడం తొందరపాటు చర్యేనన్నారు. రైల్వేలకు మళ్లీ ప్రత్యేక బడ్జెట్ తీసుకురావాలని సూచించారు. రైల్వే శాఖలో మౌలిక వసతులను మెరుగుపరచడంపై దృష్టిసారించాలని ప్రభుత్వాన్ని కోరారు. బాలేశ్వర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాద ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలని మొయిలీ డిమాండ్ చేశారు.

మృతదేహాల గుర్తింపునకు డీఎన్‌ఏ నమూనాల సేకరణ

భువనేశ్వర్: ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో ఘోర రైలు ప్రమాద ఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్నప్పటికీ 100కు పైగా గుర్తుతెలియని మృతదేహాలు ఇక్కడి వివిధ ఆసుపత్రుల్లో ఉండిపోయాయి. కాగా సంబంధిత హక్కుదారుల నుంచి డీఎన్‌ఏ నమూనాల సేకరణను భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో ప్రారంభించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఇప్పటివరకు అటువంటి వారి నుంచి 10 నమూనాలను సేకరించినట్లు పేర్కొన్నారు. మృతదేహాలను ఐదు కంటైనర్లకు తరలించామని, అందులో ఎక్కువ కాలం భద్రపరచవచ్చని ఆయన చెప్పారు. రైలు ప్రమాదంలో చనిపోయిన 278 మందిలో 177 మంది మృతదేహాలను గుర్తించగా, మరో 101 మందిని గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించాల్సి ఉంది. భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు 123 మృతదేహాలు రాగా, వాటిలో 64 మందిని గుర్తించారు. కాగా ఉపేంద్రకుమార్ శర్మ మృతదేహాన్ని తాము సోమవారం గుర్తించామని, అయితే మంగళవారం వేరొకరికి అప్పగించారని జార్ఖండ్‌కు చెందిన ఒక హక్కుదారు మంగళవారం ఆరోపించారు. 'మృత దేహాన్ని వేరొకరికి అప్పగించాక డీఎన్‌ఏ నమూనా చేయడం ఏంటి? అతని శరీరంపై ఉన్న పచ్చబొట్టు గుర్తు ద్వారా ఉపేంద్రను గుర్తించాము' అని మృతుడి బంధువు చెప్పారు. అయితే సమగ్ర విచారణ అనంతరమే మృతదేహాలను అప్పగిస్తున్నట్లు భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవాస్ త్రిపాఠి తెలిపారు. ఒకటి కంటే ఎక్కువ కుటుంబాలు ఒకే మృతదేహాన్ని తమ వారిదేనని క్లెయిమ్ చేయడం తో వాస్తవాన్ని తేల్చేందుకు డీఎన్‌ఏ నమూనా తీసుకోవడం జరిగిందని చెప్పారు. డీఎన్‌ఏ నమూనా నివేదిక రావాలంటే కనీసం 7 నుంచి 10 రోజుల సమయం పట్టవచ్చని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రస్తుతం మృతదేహాలను ప్రత్యేక కంటైనర్‌లో ఉంచుతున్నందున వాటిని భద్రపరచడంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు.

బ్రిడ్జి కూలిన ఘటనపై నిర్మాణ కంపెనీకి షోకాజ్

పాట్నా: రెండు రోజుల క్రితం బ్రిడ్జి కూలిన ఘటనను తీవ్రంగా పరిగణించిన బీహార్ ప్రభుత్వం సంబంధిత నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందని రోడ్డు నిర్మాణ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి ప్రత్యయ్ అమృత్ తెలిపారు. సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను సస్పెండ్ చేసినట్లు కూడా ఆయన పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టు పొందిన హరియాణాకు చెందిన కంపెనీకి 15 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని బీహార్ రాజ్య పుల్ నిర్మాణ్ నిగమ్ మేనేజింగ్ డైరెక్టర్ షోకాజ్ నోటీసు అందజేశారని అమృత్ పేర్కొన్నారు. కంపెనీని ప్రభుత్వం ఎందుకు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకూడదో వివరించాలని కోరామని, దానిపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

పనుల నాణ్యతపై నిఘా ఉంచడంలో విఫలమైనందుకు సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను డిపార్ట్‌మెంట్ సస్పెండ్ చేసిందని తెలిపారు. గంగా నదిపై నిర్మించిన ఈ వంతెన భాగల్పూర్-ఖగారియా జిల్లాలను కలుపుతుంది.

సికింద్రాబాద్-అగర్తల ఎక్స్‌ప్రెస్‌లో పొగలు

భువనేశ్వర్: ఒడిశాలో మూడు రైళ్లు ఢీకొని 278 మంది దుర్మరణం చెందిన ఘోర ప్రమాదాన్ని మరవకముందే మరో రైలు ప్రమాదం త్రుటిలో తప్పింది. సికింద్రాబాద్-అగర్తల ఎక్స్‌ప్రెస్‌లోని ఒక బోగీలో పొగలు కమ్మేశాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సికింద్రాబాద్ - అగర్తల ఎక్స్‌ప్రెస్ రైలు ఒడిశాలోని బరంపూర్ రైల్వే స్టేషన్‌లో ఆగినప్పుడు బి-5 ఏసీ కోచ్ నుంచి పొగలు రావడం ప్రయాణికులు గుర్తించారు. దీంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు వెంటనే బోగీ నుంచి దిగిపోయి రైల్వే అధికారులకు సమాచారమిచ్చారు. అప్రమత్తమైన అధికారులు అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. ఏసీలో మంటలు వచ్చినట్లు గుర్తించిన సిబ్బంది వాటిని ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు. అయితే, ఈ పరిణామంతో ప్రయాణికులు భీతిల్లారు.

కొందరు ప్రయాణికులు మళ్లీ బోగీ ఎక్కేందుకు నిరాకరించినట్లు రైల్వే అధికారులు చెప్పారు. ఈ ఘటనతో కొంతసేపు స్టేషన్‌లో నిలిచిన రైలు 45 నిమిషాల తర్వాత తిరిగి గమ్యస్థానానికి బయల్దేరింది.

ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిలో మానసిక ఇబ్బందులు

న్యూఢిల్లీ : ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో మూడు రైళ్ల ప్రమాద స్థలం వద్ద సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి భ్రాంతి ఏర్పడిందని, మరొకరు ఆకలిని కోల్పోయారని నివేదించినట్లు విపత్తు ప్రతిస్పందన దళం డైరెక్టర్ జనరల్ అతుల్ కర్వాల్ మంగళవారం తెలిపారు. దేశంలోని అత్యంత ఘోరమైన రైల్వే విపత్తులలో ఒకటి అయిన బాలాసోర్ దుర్ఘటన తర్వాత 9 జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలు సహాయక చర్యల కోసం మోహరించబడ్డాయి. అధికారిక సమాచారం ప్రకారం, సంఘటనా స్థలం నుంచి అతికష్టంగా 44 మంది బాధితులను రక్షించారు. 121 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. విపత్తు స్పందన-2023 కోసం సామర్థ్యం పెంపుపై వార్షిక సదస్సులో కర్వాల్ మాట్లాడుతూ 'బాలాసోర్ రైలు ప్రమాదం తరువాత సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న నా సిబ్బందిని నేను కలిశాను. అతను నీటిని చూసిన ప్రతిసారీ అతనికి రక్త భ్రాంతులు ఉన్నాయని ఒకరు నాకు చెప్పారు. మరొకరు, ఈ సహాయ కార్యక్రమాల తర్వాత తినాలనే కోరికను కోల్పోయినట్లు చెప్పారు. సహాయ కార్యక్రమాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత తమ సిబ్బందికి సైకలాజికల్ కౌన్సెలింగ్, మెంటల్ స్టెబిలిటీ కోర్సులను ప్రారంభించినట్లు ఇటీవల ప్రమాద ప్రదేశాన్ని సందర్శించిన ఎన్‌డీఆర్ఎఫ్ డీజీ తెలిపారు.

పరిహారం కోసం కొత్త తరహా మోసం

భువనేశ్వర్: ఒడిశా రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఇప్పటికీ కొంత మందిని గుర్తించలేదు. బాధితుల ఆచూకీ తెలుసుకునేందుకు వీలుగా భారతీయ రైల్వే మృతులు, గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో ఉంచింది. అయితే, కొంతమంది దురాశపరులు బాధితుల కుటుంబసభ్యులకు కడసారి చూపు దక్కనీయకుండా చేస్తున్నారు. ప్రభుత్వం అందించే పరిహారాన్ని పొందేందుకు నకిలీ ధ్రువపత్రాలతో మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికీ ఎవరు గుర్తించని మృతులను తమ కుటుంబసభ్యులుగా నమ్మించి అధికారుల నుంచి మృతదేహాలు తీసుకుంటున్నారు. ఈ కొత్తతరహా మోసాన్ని గుర్తించిన ఒడిశా ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రభుత్వ పరిహారం పొందేందుకు మోసపూరిత చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఒడిశా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా రైల్వే అధికారులు, ఒడిశా పోలీసులను కోరారు.

కటక్‌కు చెందిన గీతాంజలి దత్తా అనే మహిళ ఆదివారం బాలాసోర్‌లోని మృతుల ఫొటోలను ఉంచిన ప్రదేశానికి వచ్చింది. ప్రమాదం జరిగిన రోజు తన భర్త రైల్లో ప్రయాణించాడని, ఆయన ఆచూకీ తెలియడంలేదని పోలీసులకు తెలిపింది. దీంతో, అక్కడున్న ఫొటోల్లో తన భర్త ఆచూకీ ఉందేమో చూడాలని పోలీసులు ఆమెకు సూచించారు. కొన్ని ఫొటోలను చూసిన తర్వాత ఒక వ్యక్తి ఫొటో చూపిస్తూ ఆయనే తన భర్త అని చెప్పింది. అయితే, ఆమె ప్రవర్తనపై అనుమానం కలిగిన పోలీసులు, ఆమె చెప్పిన వివరాల ఆధారంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో విచారించగా ఆమె భర్త బతికే ఉన్నాడని తెలిసింది. దీంతో గీతాంజలిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అందించే పరిహారం కోసం ఈ చర్యలకు పాల్పడినట్లు పోలీసు విచారణలో అంగీకరించింది.

"మృతుల ఫొటోలను చూసేందుకు వచ్చినప్పుడు ఆమె ప్రవర్తనపై అనుమానం కలిగింది. ఎలాంటి భావోద్వేగాలు లేకుండా.. సాధారణంగా మృతులలో ఒక వ్యక్తి ఫొటో చూపించి తన భర్త అని చెప్పింది. ఆమె అందించిన వివరాల ఆధారంగా బారంబా పోలీస్ స్టేషన్ పరిధిలో విచారించగా.. ఆమె భర్త బతికే ఉన్నాడని తెలిసింది. దీంతో ఆమెను అదుపులోకి తీసుకొని విచారించగా.. ప్రభుత్వ పరిహారం కోసం ఈ మోసానికి పాల్పడినట్లు అంగీకరించింది" అని బాలాసోర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మార్చురీ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారి తెలిపారు.

లౌకిక రాజ్యాన్ని కాపాడటంలో సీఆర్‌ది కీలకపాత్ర

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: దేశ రాజకీయాల్లో ఘనమైన చరిత్ర కలిగిన, లౌకిక రాజ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషించిన గొప్ప నేత చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) 109వ జయంతిని సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో పోలీస్ కంట్రోల్ రూం సమీపంలో ఉన్న చంద్ర రాజేశ్వరరావు విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించారు. పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భూ సమస్యను జాతీయోద్యమంగా మార్చిన ఘనత సీఆర్‌దే అన్నారు. రాష్ట్రంలో జరిగే భూ పోరాటాలు, చల్లపల్లి జమిందార్ భూములను పేదలకు పంచే పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఉత్తారాది రాష్ట్రాల్లో జరిగిన భూ పోరాటాల్లో కూడా ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. దాదాపు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని చెప్పారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో చదువుకుని అట్టడుగు వర్గాల కోసం పని చేసిన గొప్ప నాయకులు సీఆర్ అన్నారు. 24 సంవత్సరాల పాటు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా ఉత్తరాదిలో బాబ్రి మసీదు అంశంలో సీఆర్ లౌకిక రాజ్యానికి కట్టుబడి రాజ్యాంగాన్ని కాపాడుకోవటం కోసం కృషి చేశారు. మైనార్టీలకు అండగా నిలిచారని తెలిపారు. దేశంలో లౌకికవాదాన్ని కాపాడుకోవటం కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. దేశంలో అన్ని మతాలు, కులాలు ఉండాలని ఆకాంక్షించారని కొనియాడారు. కమ్యూనిస్టుల పునరేకీకరణే సీఆర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ సందర్భంగా విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర హోం మంత్రిని ఎవరైనా కలిసి మాట్లాడవచ్చని చెప్పారు. అమిత్ షాతో చంద్రబాబు భేటీ కావటం అనేది ఎన్నికల కోణంలో చూడటం లేదన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కూడా హోం మంత్రితో మాట్లాడతారని చెప్పారు. చంద్రబాబు ఎన్నికలు, పొత్తులు, సీట్లు, సర్దుబాటు గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు.

ముందుగా సీఆర్ విగ్రహానికి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, గుజ్జుల ఈశ్వరయ్య, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రా నాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య విప్లవ గీతాలు ఆలపించారు. సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజావైద్యులు డాక్టర్ రాం ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ సీనియర్ నాయకులు వై.చెంచయ్య పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కార్యాలయంలో

విజయవాడలోని విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం చంద్రం బిల్డింగ్స్‌లో కమ్యూనిస్టు నేత, భూ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎగ్జిక్యూటీవ్ ఎడిటర్ కూన అజయ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత సీఆర్ చిత్రపటానికి విల్సన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అక్షరాల అమలు చేసిన నేత సీఆర్ అన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినా జీవితాంతం పేదల కోసమే పని చేశారని కొనియాడారు. తనకంటూ ఏమి ఉంచుకోకుండా అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి మోదుమూడి మురళీకృష్ణ, సీపీ రాంబాబు, విశాలాంధ్ర సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

అవినాశ్ ముందస్తు బెయిల్‌ను రద్దు చేయండి

సుప్రీంకోర్టును ఆశ్రయించిన వివేకా కుమార్తె సునీత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె సునీత మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వివేకా హత్య కేసులో కీలక నిందితుడైన అవినాశ్ ముందస్తు బెయిల్‌ను రద్దుచేయాలని సునీత పిటిషన్‌లో కోరారు. అవినాశ్‌కు గత నెల 31న తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వివేకా హత్య కేసులో అవినాశ్‌పై సీబీఐ మోపిన అభియోగాలన్నీ తీవ్రమైనవేనని పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు. వాటిని తెలంగాణ హైకోర్టు సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేదని, హైకోర్టు తీర్పులో కొన్ని లోపాలున్నాయని కూడా పిటిషన్‌లో సునీత పేర్కొన్నారు. అవినాశ్‌ని అరెస్ట్ చేయడం ద్వారానే ఈ కేసు దర్యాప్తు ఒక కొలిక్కి వస్తుందని, అలాగాకుండా బయటే ఉంటే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపారు. అవినాశ్ ముందస్తు బెయిల్‌ను సీబీఐ కూడా వ్యతిరేకిస్తోంది. సునీత పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంలో సీబీఐ తరపు న్యాయవాది కూడా వాదనలు వినిపించనున్నారు.

సీఆర్ స్ఫూర్తిగా ప్రజాపోరాటాలు

వాడవాడలా ఘనంగా 109వ జయంతి

విశాలాంధ్ర-హైదరాబాద్: భూపోరాటయోధ, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి చంద్ర రాజేశ్వరరావు జీవితం స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి తదితరులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చంద్ర రాజేశ్వరరావు 109వ జయంతి సందర్భంగా మంగళవారం దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టు శ్రేణులు సీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. దేశీయంగా, అంతర్జాతీయంగా కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన అందిం చిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు, పార్లమెంటు మాజీ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి, అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర రావు, కోశాధి కారి చెన్నకేశవరావు, హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ డి.కృష్ణకుమారి, వృద్ధాశ్రమ వాసులు తదితరులు పూల మాలలతో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సురవరం మాట్లాడుతూ, చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు ఉద్యమా నికి తన వ్యక్తిగత ఆస్తులను త్యాగం చేశారనీ, తెలంగాణ సాయుధ పోరాట తొలినాళ్లలో హైదరాబాదు రెడ్డి హాస్టల్లో తన పేరు మార్చుకొని ప్రవేశించి రావి నారాయణరెడ్డి, గురువారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ తదితర ప్రముఖులతో కలిసి కమ్యూనిస్టు పార్టీని నిర్మించి, తెలంగాణ సాయుధ పోరాట ఉధృతికి, విజయానికి కృషి చేశారని గుర్తు చేశారు.

నారాయణ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు భౌతికంగా మన వద్ద లేకపోయినా ఆయన ఆశయాల రూపంలో మనం దరిలో ఉన్నాడన్నారు. చంద్ర రాజేశ్వరరావు సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసి అనేకమందికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. చంద్ర రాజేశ్వర రావు ఆశయాలను సాధించడం కోసం కృషి చేస్తామని ప్రతినబూనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి బీవీ విజయలక్ష్మి, వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు సోమూరి తుకారాం, డాక్టర్ పి.సరస్వతి, రాజేంద్ర రావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమ వాసులు, సీనియర్ సినీనటులు కాకరాల, తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.